

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికలను సజావుగా నిర్వహిస్తాం!

- 445 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- సీ విజల్ యాప్‌లో 275 ఫిర్యాదు
- రాష్ట్ర ఎన్నికల అధికారితో కలెక్టర్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 6 : జిల్లాలోని 445 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1223 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. 18 ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నగదు, మద్యం, డ్రగ్స్ అక్రమ రవాణా జరగకుండా నింతరం తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. నిబంధనలు పాటించని 22 మంది వలంటీర్లను తొలగించామని, 9 మంది వలంటీర్లపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అంతేగాక 29 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించామని, 8 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. కోడ్ ఉల్లంఘించిన నలుగురు ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని, మరో నలుగురుపై కేసులు నమోదు చేసి, ఒకరిని సస్పెండ్ చేశామన్నారు. ఇక సివిజిల్ యాప్ ద్వారా 275 ఫిర్యాదులు వచ్చాయని, వీటన్నిటిని పరిష్కరించినట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ లవన్న, ఏఎస్పీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● రాజకీయ ప్రకటనలకు డిక్లరేషన్ తప్పనిసరి

రాజకీయ ప్రకటనలు ప్రచురించే ప్రింటర్లు, కరపత్రాలు, పోస్టర్లు ప్రచురించిన 48 గంటల్లో డిక్లరేషన్ ఫారాలను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో అందజేయాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో పెద్ద పత్రికలు, చిన్న పత్రికలు రాజకీయ ప్రకటనలు ప్రచురిస్తున్నాయని, అందుకు సంబంధించిన ఎంపెండిక్స్-ఎ, బి, పబ్లిషర్ ఆధార్ కార్డు, ప్రకటన, పాంప్లెట్, పోస్టర్ కాపీలతోపాటు సంబంధిత బిల్లు కాపీ జతపరచాలని పేర్కొన్నారు. జతపరిచిన వాటిని ఎన్నికల అధికారి కార్యాలయం లేదా, ఎంసీఎంసీ కార్యాలయంలో అందజేయాలని, లేకుంటే సెక్షన్ 127ఎ ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

● ఎన్నికల అధికారులతో సమీక్ష

నెల్లూరు(సిటీ) : నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో సిటీ, రూరల్, సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో కలెక్టర్ హరినారాయణన్ శనివారం సమీక్ష నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జాగ్రత్తగా మాక్ పోలింగ్ ప్రక్రియలో పాల్గొన్నాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూడాలని చెప్పారు. సెక్టోరల్ అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గాల ఆర్వోలు పాల్గొన్నారు.

పెన్షన్ పడలేదబ్బా!

- బ్యాంకుల చుట్టూ విశ్రాంత ఉద్యోగుల ప్రదక్షిణలు



ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 6 : పెన్షన్ నగదు కోసం విశ్రాంత ఉద్యోగులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మాసం ప్రారంభమై ఆరు రోజులు గడిచినా మార్చి నెల పెన్షన్ నగదు ఇంకా పలువురి ఖాతాల్లో జమ కాలేదు. ఎందుకు జమ కాలేదో తెలుసుకొనేందుకు ప్రతి రోజు బ్యాంకులు, సబ్ ట్రెజరీ కార్యాలయాలకు మండుటెండలో తిరగాల్సిన దుస్థితి నెలకొందని వృద్ధులు వాపోతున్నారు. సకాలంలో ప్రభుత్వం పెన్షన్ నగదు జమ చేయకపోవడంతో నెలవారి మందులు, ఇతరత్రా అవసరాలకు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయగిరి సబ్ ట్రెజరీ పరిలో 784 మంది విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటి వరకు 50 శాతం మందికి మాత్రమే ప్రభుత్వం పెన్షన్ నగదు వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలుపుతున్నారు. విషయం తెలుసుకొందామని కొందరు విశ్రాంత ఉద్యోగులు సబ్ ట్రెజరీ కార్యాలయానికి వెళ్లగా అక్కడ బిల్ స్టేటస్ సైతం ఓపెన్ కాకపోవడంతో ఉసూరు మంటూ ఇళ్లకు వెనుతిరుగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెన్షన్ నగదు జమ చేయాలని పింఛనుదారులు కోరుతున్నారు.

వందలాదిగా ఆర్టీసీ బస్సులు.. అంతే సంఖ్యలో చిన్నాపెద్ద ప్రైవేటు వాహనాలు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల నుంచి కూడా జన సమీకరణ.. అయినా లక్షన్నర మందిని తీసుకురావలన్నది లక్ష్యం. అయితే 40 వేల నుంచి 50 వేలకు మించని జనం. వచ్చిన వారిలోనూ మొక్కుబడి స్పందన. జగన్ ప్రసంగం పట్ల నిరాసక్తి. ప్రతిపక్ష నేత చంద్రబాబుపై విమర్శల సందర్భంగా ప్రజా స్పందనకు తాపత్రయపడిన జగన్. అయినా స్పందనలేని వైనం. ఏం చేశాడో చెప్పమని చంద్రబాబుపై విమర్శలు సంధించిన జగన్ జిల్లాకు తానేమి చేశాడో, ఏం చేస్తారో చెప్పకుండానే ప్రసంగాన్ని ముగించారు. ఇదీ కావలిలో శనివారం సాయంత్రం జరిగిన సిద్ధం సభ తీరు.




ముఖ్యమంత్రి జగన్ ప్రసంగిస్తున్న సమయంలో జనం లేక ఖాళీగా ఉన్న గ్యాలరీ

పేలని జ'గన్'

- 'సిద్ధం' సభలో ప్రజాస్పందన నిల్
- సీఎం ప్రసంగంపై జనం నిరాసక్తి
- జిల్లాకు తానేం చేశాడో.. ఏం చేస్తాడో చెప్పని వైనం
- చేతులెత్తి ఇలా.. ఇలా అనాలన్నా ప్రజల్లో ముభావం
- జన సమీకరణకు సర్వశక్తులూ ఒడ్డిన వైసీపీ

నెల్లూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : కావలిలో శనివారం సాయంత్రం మేము సిద్ధం సభకు 1.5లక్షల మందిని తరలించి రికార్డు సృష్టించాలని వైసీపీ నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, నెల్లూరు జిల్లాతో పాటు రాయలసీమ, ప్రకాశం జిల్లాల నుంచి కూడా జనాలను తరలించినా అనుకున్నంత మందిని తరలించలేకపోయారు. కావలి సభకు తోలిన జనం మహా అయితే 50వేల మందికి మించి లేరన్నది ప్రజావాక్కు. ఇప్పటికే పలు సిద్ధం సభలకు తరలించిన వారినే కావలి సభకూ తీసుకొచ్చారు. ఉదాహరణకు గత నెల మేదరమిట్లలో జరిగిన సిద్ధం సభకు కందుకూరు నియోజకవర్గం నుంచి భారీగా జనాలను తరలించారు. ఈ రోజు కావలి సభకు 170 ఆర్టీసీ బస్సులు, అంతకన్నా ఎక్కువ సంఖ్యలో ప్రైవేటు వాహనాల్లో మేదరమిట్లకు తోలినవారినే మళ్లీ కావలి సభకు తోలుకొచ్చినట్లు చెబుతున్నారు. రాయచోటి మొదలు పలమనేరు, చిత్తూరు, తిరుపతి ప్రాంతాల నుంచి కూడా జనాలను తీసుకొచ్చారు. వీరిలో అత్యధికులు ఇదివరకే ఆయా ప్రాంతాల్లో సిద్ధం సభలకు తరలించినవారుగా తెలిసింది.



జాతీయ రహదారిపై ఉన్న ఆర్టీసీ బస్సులు

● కనిపించని జనస్పందన

చంద్రబాబును విమర్శిస్తూ మాట్లాడిన ప్రతి మాటకు జగన్ ప్రజల నుంచి స్పందన ఆశించారు. కానీ ప్రజలు మాత్రం స్పందించలేదు. 2014, ఎన్నికల సందర్భంగా చంద్రబాబు కూటమి ఇచ్చిన హామీలు చదివి వినిపిస్తూ వాటిని చంద్రబాబు నెరవేర్చారా!? అని పలుమార్లు ప్రశ్నించారు. లేదు.. లేదు అని ప్రజల నుంచి స్పందన వస్తుందని ఆశించారు. ఇలా ఇలిలా ఇలిలా చేతులూపాలి అని మాటిమాటికి ఎడమ చెయ్యి పైకెత్తి అడ్డంగా ఊపుతూ అభినయించినా ప్రజలు మాత్రం ఎందుకనో ముభావంగా ఉండిపోయారు. జగన్ ముందు ఉన్న కొంత మంది మాత్రమే జగన్ సంజ్ఞలకు స్పందిస్తూ చేతులు ఊపారు. ఈసారి గట్టిగా రెండు చేతులు పైకెత్తి ఊపాలబ్బా అని జగన్ గట్టిగా కోరినా సభకు హాజరైన ప్రజలు పెద్దగా పట్టించుకోలేదు. ఈ ఎన్నికల యుద్ధంలో మీ బిడ్డ జగన్‌కు తోడుగా ఉండటానికి సిద్ధమేనా! అని అడుగుతున్నా! అని పెద్ద గొంతుకతో జగన్ కోరినా సభికుల నుంచి సిద్ధమే అనే మాట చాలా బలహీనంగా వినిపించడం కొత్త అంచనాలకు ఆస్కారం కలిగించింది.

● జిల్లా గురించి ప్రస్తావన ఏదీ!?

14 సంవత్సరాలు సీఎంగా పని చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు ఏం చేశాడని పదే పదే ప్రశ్నించిన జగన్ ఐదేళ్ల సీఎంగా తను నెల్లూరు జిల్లాకు ఏం చేశాడో మాట మాత్రం కూడా చెప్పలేకపోయారు. భవిష్యత్తులో ఏం చేస్తాడో కూడా హామీ ఇవ్వకుండానే సభ ముగించేశారు. వాస్తవానికి గడిచిన ఐదేళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలైన సంక్షేమ పథకాలు మినహా జగన్ హయాంలో జిల్లాలో ప్రత్యేకంగా జరిగిన అభివృద్ధి అంటూ ఏమీలేదు. ఒక్కటంటే ఒక్క మంచి పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదు సరికదా కృష్ణపట్నం పోర్టు పరిధిలోని కంటైనర్ టెర్మినల్ కూడా మూతపడి వేలాది కార్మిక కుటుంబాలు వీధినపడే పరిస్థితి వచ్చింది. టీడీపీ హయాంలో 90 శాతానికిపైగా పూర్తయిన ఒకటి రెండు సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యాయి తప్ప ప్రధాన సాగునీటి కాలువల పనుల పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అనే చందంగా తయారయ్యింది. జిల్లాలో ఏమి జరగలేదన్న సత్యం బాగా గుర్తెరిగిన కారణంగానేమో జగన్ జిల్లా ప్రస్తావనే ఎత్తకుండా సిద్ధం సభను ముగించారు.



సీఎం జగన్ ప్రసంగిస్తుండగా గ్యాలరీ గేట్లు ఎక్కి వెళ్లిపోతున్న మహిళలు



తప్పని ప్రయాణ కష్టాలు

ఉదయగిరి ప్రాంతంలో వివిధ మార్గాలకు వెళ్లేందుకు బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కావలిలో సీఎం జగన్ సభకు ఉదయగిరి డిపో నుంచి 30 బస్సులను కేటాయించారు. దీంతో కావలి, నెల్లూరు, పామూరు, ఆత్మకూరు, బద్వేల్, విజయవాడ తదితర ప్రాంతాలకు బస్సులు లేక ప్రజలు బస్టాండ్ సెంటర్‌లో మండుటెండలో వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది.

\- ఉదయగిరి



డివైడర్‌నే కాదు.. దేన్నైనా కూలుస్తాం !

కావలి : 'మేమంతా సిద్ధం' సభ సభ కోసం జాతీయ రహదారి డివైడర్‌ను ధ్వంసం చేశారు. కావలి సమీపంలోని జాతీయరహదారి పక్కన ఓ లేఅవుట్‌లో సీఎం జగన్ సభ నిర్వహించారు. అయితే ఆ లేఅవుట్‌లో హద్దు రాళ్లను తొలగించటంతో అక్కడ ప్లాట్లు కొన్నవారు తమ ప్లాటు ఎక్కడుందో తెలుసుకునేందుకు నానా తంటాలు పడక తప్పదు. మరోవైపు సీఎం కాన్వాయి కోసం హైవేలోని డివైడర్‌ను 30 అడుగుల దూరం పగలగొట్టారు. సీఎం సభ కోసం మేం దేనికైనా సిద్ధమంటూ కావలి నేతలు మరోసారి రుజువు చేశారు.



చిన్నారులతోపాటు సుమారు 30 మందిని ఎక్కించుకుని సీఎం సభకు వెళుతున్న ట్రక్కు

తీవ్ర ఒత్తిడితో చిన్నారుల విలవిల

కావలి రూరల్, ఏప్రిల్ 6 : సీఎం జగన్మోహన్ రెడ్డి శనివారం కావలిలో నిర్వహించిన సిద్ధం సభకు ప్రమాదమని తెలిసినా ఆటోలు, వ్యాన్లు, ట్రక్ ఆటోల్లో పరిమితికి మించి జనాలను ఎక్కించి తరలించారు. ఈ సభకు నగదు, మద్యం ఎరచూపి జిల్లా నలుమూలల నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో ప్రజలను తరలించారు. సభకు తరలించేటప్పుడు పేర్లు రాసుకుని నగదు పంపిణీ చేస్తుండటంతో చంటి బిడ్డలను సైతం ఎత్తుకుని, ఎండన బడి వాహనాల్లో మహిళలు వచ్చారు. ప్రయాణంలో తీవ్ర ఒత్తిడితో చిన్నారులు విలవిల్లాడిపోయారు. బస్సుల్లో వచ్చిన మరికొందరు చిన్నారులు బస్సులపైకి ఎక్కి సెల్ఫీలు తీసుకున్నారు.

● చిన్నారులకు ట్యాటూలు

సభకు వచ్చిన పెద్దలతోపాటు చిన్నారులకు సిద్ధం... అంటూ ఉండే ట్యాటూ ముద్రలను వారి గుండెలపై అక్కడ వలంటీర్లుగా వ్యవహరించిన వారు ముద్రించారు. ప్రభుత్వ పథకాలతో ఉన్న క్యాలెండర్లు, జగన్ బొమ్మ ముద్రణతో అట్టకు ఏర్పాటు చేసిన బొట్టుబిళ్లలను కూడా పంపిణీ చేశారు.

ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వండి

- జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 6 : రెండో పంటకు సాగునీటి లభ్యత లేకపోవడంతో జిల్లా రైతాంగం వరికి బదులుగా ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి సూచించారు. ఈ విషయమై శనివారం నెల్లూరులోని తన కార్యాలయంలో వ్యవసాయాధికారులతో ఆమె సమావేశమై మాట్లాడారు. డెల్టా ప్రాంతంతోపాటు బోర్ల కింద ఈ సీజన్‌లో జొన్న, మొక్క జొన్న, సజ్జ, వేరుశనగ, నువ్వులు, పెసర, మినుము, అలసంద తదితర ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని అన్నారు. ఆయా పంటలకు నీటి ఖర్చు 5 నుంచి 6 రెట్లు తక్కువగా ఉంటుందని, సాగు ఖర్చు లుగా కూడా తక్కువన్నారు. ఆదాయం మాత్రం ఎకరాకి వరికి సమానంగా లేదంటే ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వేరుశనగలో టాగ్-24, కదిరి లేపాక్షి 1812, టీసీజీఎస్-1694 రకాలు అనువైనవని చెప్పారు. పెసరలో పల్లాకు తెగులు తట్టు కునే రకాలైన డబ్ల్యు జీజీ-42, ఎల్‌జీజీ- 574, 607, ఐపీఎం-2-14 రకాలు అనుకూలమని నువ్వుల పంటలో వైఎల్ఎం-66, మినుములో టీబీజీ-104, 129, ఎల్‌బీజీ-632 రకాలు సాగు చేసుకోవచ్చని తెలియజేశారు. జొన్న, మొక్క జొన్న, సజ్జ పంటలు సాగు చేసుకునే రైతులు ఈసీజన్ లో హైబ్రీడ్ రకాలను ఎంచుకోవాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో అవగాహన

ఆరుతడి పంటలపై వచ్చే వారం నుంచి క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్ర మాలు నిర్వహించనున్నట్లు సత్యవాణి చెప్పారు. జిల్లా వనరుల కేంద్రం అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో కలిసి శిక్షణ, అవగాహన కార్యక్ర మాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఒకే పంటను ముఖ్యంగా వరిని పదే పదే వేయడం వల్ల చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుందని అంతేకాకుండా సాగు ఖర్చులు పెరి గి దిగుబడులు తగ్గుతాయని చెప్పారు.



వ్యవసాయాధికారులకు సూచనలిస్తున్న డీఏవో సత్యవాణి

జగన్ భాయ్.. రంజాన్ తోఫా కహా!?

- టీడీపీ హయాంలో 'చంద్రన్న' పేరుతో పంపిణీ
- వైసీపీ ప్రభుత్వంలో అందని పండుగ సరుకులు

ఉదయగిరి, ఏప్రిల్ 6 : టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రన్న పేరుతో పండుగ రోజు ఇచ్చే నిత్యావసర సరుకులను ముస్లింలు రంజాన్ తోఫా అనేవారు. ఈ పేరు వింటే ముస్లిం మైనారిటీలకు ఎనలేని ఆనందం. రంజాన్ పండుగ రోజు పేద ముస్లింలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఈ కానుక అందజేసేవారు. పండుగను ఉత్సాహంగా జరుపుకునేవారు. అయితే, వైసీపీ ప్రభుత్వం వచ్చాక రంజాన్ తోఫాను ఆపేశారు.

● తోఫాలో ఇచ్చే సరుకులు

నాలుగు రకాల వస్తువులతో పాటు అందించే కిట్టును తెల్ల రేషన్‌కార్డు ఉన్న ముస్లిం మైనారిటీలకు అందించేవారు. అప్పటి ధరలకు అనుగుణంగా ఆ నిత్యావసర సరుకుల విలువ రూ.400 చేసేది. చంద్రన్న కిట్టులో ఐదు కేజీల గోధుమపిండి, రెండు కేజీల చక్కెర, కేజీ సేమియా, 100 గ్రాముల నెయ్యి ఉండేది. రాష్ట్ర వ్యాప్తంగా 12లక్షల ముస్లిం మైనారిటీ కుటుంబాలకు దాదాపు రూ.48 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

● తోఫాకు మొండిచేయి..

ఐదేళ్ల కిందట అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి గండి కొట్టింది. రంజాన్ తోఫాను రద్దు చేసింది. అంతేకాదండోయ్.. వైసీపీ పాలనలో ఒక్క పండుగకు కూడా తోఫాలు అందించకపోవడంపై ముస్లింలు మండిపడుతున్నారు.



టీడీపీ పాలనలో ముస్లింలకు అందజేసిన రంజాన్ తోఫా కిట్లు

పేదల పొట్ట కొట్టారు

వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి ముస్లిం మైనారిటీలపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తోంది. మాకు అందాల్సిన సంక్షేమ పథకాలు, కార్పొరేషన్ల ద్వారా అందాల్సిన సబ్సిడీ రుణాలు రద్దు చేసింది. రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని చంద్రబాబు ప్రవేశపెట్టిన రంజాన్ తోఫా దూరం చేయడం విచారకరం.

\- రహంతుల్లా, ఉదయగిరి

తోఫాతో పండుగ చేసుకునే వాళ్లం

టీడీపీ పాలనలో అందించిన రంజాన్ తోఫాతో మాలాంటి పేదలు, ఆర్థిక ఇబ్బందులు పడే మధ్యతరగతి వారు పండుగను బాగా జరుపుకునే వాళ్లం. మంచి పిండి వంటలు చేసుకుని కుటుంబంతో ఆనందంగా గడిపేవాళ్లం. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రంజాన్ తోఫాను నిలిపివేసింది. మంచి పని ఎవరు చేసినా దాన్ని అమలు చేయాలే గాని ఆపకూడదు.

\- జన్నత్, ఉదయగిరి

టీడీఆర్ బాండ్లపై ఇప్పుడేమంటారు?

- రూ. 4 వేల కోట్ల అవినీతిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- నిందితులను వెంటనే అరెస్టు చేయాలి : టీడీపీ నేత ఆనం



టీడీఆర్ పత్రాల నకళ్లను దహనం చేస్తున్న ఆనం వెంకటరమణారెడ్డి

నెల్లూరు(వైద్యం) ఏప్రిల్ 6 : తిరుపతి రోడ్ల విస్తరణలో టీడీఆర్ బాండ్లపై వస్తున్న అవినీతి ఆరోపణలపై స్పందించిన మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి వెంటనే భూసేకరణను ఆపేయాలని నోటీసులు జారీ చేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి తెలిపారు. నెల్లూరు లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి ఈ వ్యవహారంలో రూ. 10వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని గతంలో తాను వెల్లడించానన్నారు. అయితే ఇప్పుడు శ్రీలక్ష్మి ఇచ్చిన నోటీసులకు వారు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 17 రోడ్ల కోసం 376 టీడీఆర్ బాండ్లు తయారు చేసి రూ. 4వేల కోట్లు అవినీతికి శ్రీకారం చుట్టారని ఆనం ఆరోపించారు. ఇందులో రూ. 2వేల కోట్లు ఇప్పటికే బాండ్ల రూపంలో కొనుగోలు చేశారని వెల్లడించారు. జరిగిన అవినీతిపై విచారణ చేయించి దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. కరుణాకరరెడ్డి, అభినయరెడ్డిపై రెవెన్యూ రికవరీ యాక్టు అమలు చేస్తారా అంటూ ప్రశ్నించారు. ఇందులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు రోహిత్‌రెడ్డిల ప్రమేయం కూడా ఉందని చెప్పారు. అప్పటి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత కూడా అవినీతిలో భాగస్తులేనని తెలుస్తోందన్నారు అలాగే ఆర్డీవో నరసారెడ్డి, రిజిస్ట్రార్, సర్వేయర్‌లకు ఇందులో ప్రమేయం ఉన్నట్లు తెలుస్తున్నదని ఆయన విమర్శించారు. కాగా మరో 2 నెలల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావటం ఖాయమని, తిరుపతి టీడీఆర్ బాండ్లపై పూర్తిస్థాయి విచారణ చేపడతామని ఆనం హెచ్చరించారు. భూములు ఇచ్చి నష్టపోయిన బాధితులకు తమ ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని ఆనం భరోసా ఇచ్చారు.

బొప్పాయి ధర భళా..

- టన్ను రూ.15వేలు
- లాభాల బాటలో రైతులు



అనంతసాగరం, ఏప్రిల్ 6: ఈ ఏడాది బొప్పాయికి ఆశాజనకంగా ధర లభిస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బొమ్మవరం, గౌరవరం, యాకర్లపాడు, చాపురాళ్లపల్లి, సంజీవనగరం గ్రామాల్లో రైతులు విస్తారంగా బొప్పాయి పంట సాగు చేశారు. ప్రస్తుతం అగ్రహారంలో బొప్పాయి దిగుబడి చేతికందుతుంది. బయట మార్కెట్‌లో గిరాకీ బాగుండడంతో వ్యాపారులే రైతుల వద్దకు పరుగుతీస్తున్నారు. రంజాన్ మాసంలో బొప్పాయికి ఆశాజనకపు ధర లభిస్తుంది. చేతికందిన దిగుబడిని పేపర్‌లలో చుట్టి వాహనాల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. గత ఏడాది సీజన్‌లో టన్ను రూ.7 నుంచి రూ.10వేలు లోపు ధర ఉండగా ఆశించిన రీతిలో లాభాలు గడించలేకపోయామని ప్రస్తుతం టన్ను రూ.15వేలు పలుకుతుండగా ఆదాయం బాగుందని సాగుదారులు చెబుతున్నారు.

సౌదీలో రోడ్డు ప్రమాదం

- మామ, అల్లుడి మృతి.. నర్రవాడలో విషాదం



మృతులు వెంకటరామారావు, సత్యబాబు (ఫైల్)

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 6: సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుత్తలూరు మండలం నర్రవాడకు చెందిన ఇద్దరు మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది. నర్రవాడకు చెందిన భవనాసి సత్యబాబు సౌదీలోని జుబేల్ అనే పట్టణంలో ఓ పారిశ్రామిక సంస్థలో ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భార్య కీర్తిహారిక, ఏడాదిన్నర బాలుడు అక్కడే ఉంటున్నారు. గుంటూరుకు చెందిన సత్యబాబు మామ వెంకటరామారావు, అతని భార్య శ్రీదేవి, కుమార్తె, అల్లుడు, మనవడితో సరదాగా గడిపేందుకు రెండు నెలల విజిటింగ్ వీసాపై గురువారం విజయవాడ నుంచి బయలుదేరి శుక్రవారం సౌదీలోని దమామ్ విమానాశ్రయంలో దిగారు. సత్యబాబు, కీర్తిహారిక, మనవడుతో కలిసివారు జుబేల్ ప్రాంతానికి తిరుగు ప్రయాణమయ్యారు. విమానాశ్రయం నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే వారి కారును ఓ భారీ వాహనం వేగంగా ఢీకొంది. దీంతో మామా అల్లుళ్లయిన సత్యబాబు, రామారావులకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీదేవి, కీర్తిహారిక, బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన సమీపంలోని వైద్యశాలకు తరలించగా, అప్పటికే సత్యబాబు, రామారావు మృతి చెందినట్లు శుక్రవారం మధ్యాహ్నం తమకు సమాచారం అందిందని నర్రవాడలో ఉంటునన కుటుంబ సభ్యులు తెలిపారు. సత్యబాబు మృతి విషయం తెలిసి నర్రవాడలో విషాదఛాయలు అలుముకొన్నాయి. రంజాన్ పర్వదినం కావడంతో మృతదేహాలు స్వగ్రామానికి వచ్చేందుకు కూడా ఆలస్యమవుతుందని అక్కడి అధికారులు తెలిపినట్లు వారు తెలిపారు.

బైక్ పైనుంచి పడి మహిళ మృతి



మృతి చెందిన కామేశ్వరమ్మ

సంగం, ఏప్రిల్ 6: పెరమన క్రాస్‌రోడ్డుకు సమీపంలోని శనివారం రాత్రి ముంబాయి జాతీయ రహదారిపై మోటారు బైక్.. గేదెను ఢీకొట్టడంతో వెనుక కూర్చొన్న మహిళ కింద పడి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక వడ్డెక కాలనీకి చెందిన టి.కామేశ్వరమ్మ (38) వెంకటరమణయ్య అనే బేల్దారి మేస్త్రీతో కలిసి వింజమూరుకు పనికి వెళ్లింది. పని ముగించుకుని సాయంత్రం తిరిగి వస్తుండగా పెరమన క్రాస్‌రోడుకు సమీపంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. మహిళ కింద పడి తలకు తీవ్రగాయమై రక్తస్రావం అయ్యింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది స్థానిక వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అక్కడ మహిళ మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కోటితీర్థంలో వృద్ధుడి ఆత్మహత్య

చేజర్ల, ఏప్రిల్ 6: మండలంలోని కోటితీర్థం గ్రామంలో శనివారం పి.కోటారెడ్డి (81) అనే వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జలదంకి మండలం బ్రాహ్మణకాకు చెందిన ఇతను ఐదు సంవత్సరాలుగా కోటితీర్థంలోని వెంకయ్యస్వామి ఆశ్రమంలో జీవనం సాగిస్తున్నాడని స్థానికులు తెలిపారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని తీసుకవెళ్లేందుకు ఎవరూ ముందరకు రాలేదు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఈ కేసు మేరకు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలిపై రాడ్డుతో దాడి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 6: నగరంలోని రామ్‌నగర్ ప్రాంతంలో ఓ యువకుడు ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై రాడ్డుతో దాడి చేశాడు. స్థానికుల సమాచారం మేరకు.. నగరంలోని రామ్‌నగర్ మొదటి వీధిలో వృద్ధురాలు విజయమ్మ ఒంటరిగా నివాసం ఉంటోంది. శనివారం మధ్యాహ్నం అదే ప్రాంతానికి చెందిన మోహమ్మద్ అలియాస్ అహ్మద్ అనే యువకుడు వృద్ధురాలు ఇంట్లోకి జొరబడి కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో రాడ్డుతో తలపై బలంగా కొట్టాడు. దీంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. ఆమె అరుపులు విన్న స్థానికులు సంఘటన స్థలానికి చేరుకునే లోపే యువకుడు పరారయ్యాడు. దీంతో వృద్ధురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానికులు ఎస్పీ కె ఆరీఫ్ హాఫీజ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే చట్టప్రకారం చర్యలు చేపట్టాలని దర్గామిట్ట పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌టీయూ సమాచార స్రవంతి ఆవిష్కరణ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 6 : ఎస్‌టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన సమాచార స్రవంతిని విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం శనివారం ఆవిష్కరించారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.అశోక్‌బాబు, జి.రాజమనోహర్ మాట్లాడారు. అనంతరం సమాచార స్రవంతిని స్పాట్‌లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో పీవీజే.రామారావు, కావలి డిప్యూటీ ఈవో దశరథరామయ్య, ఎస్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కె.కృష్ణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పీ.సుమన్, ఎం.వీరాస్వామి, టి.అనన్య పాల్గొన్నారు.

ఈ కారు ఎవరిది?



నెల్లూరురూరల్, ఏప్రిల్ 6 : మండలంలోని వెల్లంటి (మర్రిచెట్టు) వద్ద నెల్లూరు-తాటిపర్తి రహదారిపై వారం రోజులుగా ఓ కారు అనుమానస్పదంగా ఉంది. ఏపీ 26 ఏబీ 2940 నెంబరు గల ఈ కారు రోడ్డుపై ఉంచి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. వారం రోజులైనా ఎవరు రాకపోవడంతో గ్రామంలోని సచివాలయ పోలీసుకు సమాచారం అందించారు. అయితే ఈ కారును తీసుకెళ్లేందుకు ట్రాలీ లేదని పోలీసులు పట్టించుకోలేదని గ్రామస్థులు చెబుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	161
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	280
స్కిన్‌లెస్	310
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6731
వెండి కిలో ధర	రూ. 83,000
వెండి ఒక గ్రాము	రూ. 85.00

రెండు టిప్పర్ల పట్టివేత

సంగం, ఏప్రిల్ 6: మండలంలోని సంగం ఎత్తిపోతల స్కీమ్ సమీపం నుంచి గ్రావెల్ తరలించేందుకు నిలిపి ఉన్న రెండు ఖాళీ టిప్పర్లను శనివారం రాత్రి స్పెషల్ స్క్వాడ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం వీటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రెండు టిప్పర్లు

పేదల వైద్యానికి భరోసా ఏదీ..?

- ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించేనా?
- పాలకుల హామీలు నెరవేరేదెన్నడు..
- సంపాదనలో 40 శాతం వైద్యానికే ఖర్చు
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 6 : నిరుపేదలకు అవసరమైన వైద్యం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందుతోంది. పేర్లు మార్చి ఎన్ని పథకాలు తీసుకొచ్చినా అవి అందరికీ అందని ద్రాక్షలా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం ఏటా జాతీయ ఆరోగ్య మిషన్ కింద రూ.25 కోట్లు జిల్లాకు కేటాయిస్తోంది. అయితే ఆ నిధులు జిల్లాలోని 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలకు, రెండు ఏరియా, జిల్లా ఆసుపత్రులకు రూ.1.30 కోట్లు విడుదల చేస్తోంది. మిగిలిన మొత్తం ఉద్యోగుల జీత భత్యాలు, ఇతర వైద్య పథకాలకు ఖర్చు చేస్తుంటారు. అయితే ఈ నిధులలో కొంత మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. దీంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు తమ సంపాదనలో 40 శాతం వైద్యానికే ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లావ్యాప్తంగా 26 లక్షల మందికిపైగా జనాభా ఉన్నా కేవలం 25 శాతం మందికి మాత్రమే అరకొరగా ప్రభుత్వ వైద్యం అందుతోంది. 75 శాతం ప్రైవేట్ రంగంలోనే వైద్యం చేయించుకుంటున్నారు.

హామీలు ఏమయ్యాయి!?

వైద్య సేవలపై రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో హామీలు గుప్పించినా అమలులో మాత్రం నిర్లక్ష్యం వహిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకు వస్తాం.. ప్రజారోగ్యాన్ని మెరుగుపరుస్తాం.. పేదలు వైద్యం కోసం పైసా ఖర్చు లేకుండా అన్ని ప్రభుత్వమే భరిస్తోందని ఇచ్చిన హామీలు అమలు జరిగిన దాఖలాలు లేవు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలకు వెళ్లే పేదలకు వైద్యులు అందుబాటులో ఉండని దుస్థితి. ఎన్నికల నేపథ్యంలో గత సెప్టెంబరులో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష పేరుతో ఇంటింటికి వైద్యం అందిస్తామని చెప్పినా పూర్తిస్థాయిలో వైద్యంపై మీనమేషాలు లెక్కిస్తోంది. నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 750 పడకలు ఉండగా, ప్రతి రోజూ 550 మంది వరకు రోగులు వైద్యం పొందుతుంటారు. ఇక్కడ గుండెకు సంబంధించి వైద్య నిపుణులను నేటికీ నియమించలేదు. ఇక కేన్సర్ నూతన సాంకేతిక విభాగం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించి రెండేళ్లయినా అది కార్యరూపం దాల్చలేదు. పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక వైద్య కళాశాల పెడతామని ప్రభుత్వం చెస్తున్న ప్రకటనలకు భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఆరోగ్యశ్రీ బకాయిల మాటేమిటి?

జిల్లావ్యాప్తంగా 71 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా, రూ.6 కోట్లకుపైగా బకాయిలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు మంజూరుచేయకపోవడంతో ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు చేయలేమంటూ పలు ఆసుపత్రుల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. ఆరోగ్యశ్రీ కింద రూ. 25 లక్షల వరకు ఖర్చు చేసేలా ప్రభుత్వం ఇటీవల ప్రకటించినా అది అమలు కావడం లేదు. వెయ్యి రూపాయలు దాటిన వైద్యం ఆరోగ్యశ్రీలోకి చేరుస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన ఆచరణకు నోచలేదు. వైద్య రంగంలో ఎన్నో ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చినా జిల్లాలోని ఆసుపత్రులలో గర్భిణులు ప్రసవ సమయంలోనూ ప్రసవానంతరం ప్రతి లక్ష మందిలో 45 మంది మరణిస్తున్నారు. ఇక శిశుమరణాలు ప్రతి వెయ్యిమందిలో 25 మంది మృత్యు వాత పడుతోన్నారు.

నిధులకు ప్రాధాన్యత ఇవ్వాలి



ప్రభుత్వ వైద్యం కోసం ప్రత్యేకంగా నిధుల విడుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. నిధులు అందక వైద్య పథకాలు తొలిదశలోనే నిర్వీర్యం అవుతున్నాయి. జీడీపీలో 7 శాతం నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతున్నా కేవలం 1.5 శాతం కేటాయిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న నిధులు సొంతానికి వాడుకుంటుందన్న విమర్శలు ఉన్నాయి. జెనరిక్ మందులు కూడా పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అనేక సంస్కరణలు చేపట్టాలి.

- డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

ఆధునిక వైద్యం అందించేలా కృషి చేయాలి



ఎప్పటి కప్పుడు వైద్య రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆధునిక చికిత్సలను అందచేయాలి. దీంతో పాటు ఆధునిక వైద్య పరికరాలను కూడా అందుబాటులో ఉంచాలి. గ్రామీణ ప్రాంతాలకు ఇలాంటి వైద్య చికిత్సలు అందేలా పాటు పడాలి. అప్పుడే అనుకున్న వైద్య చికిత్సలను పూర్తి స్థాయిలో అందించగలం. ఆధునిక వైద్య విధానాలపై వైద్యులకు శిక్షణ ఇవ్వాలి.

- డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్

వైభవంగా సంగమేశ్వరుడి ధ్వజారోహణ



ధ్వజారోహణ నిర్వహిస్తున్న పండితులు

సంగం, ఏప్రిల్ 6: పెన్నానది ఒడ్డున వెలసిన సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శుక్రవారం అర్ధరాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితులు మంగళవాయిద్యాలు, మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదంగా అందచేసే కొడిముద్ద కోసం భక్తులు ఎగపడ్డారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమానికి అవ్వారి వెంకటేశ్వర్లు దంపతులు, బత్తూరు బాలయ్య వారసులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు ఎగబడ్డారు.

సోమశిలలో 9.153 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 6: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారానికి ప్రాజెక్టులో 9.153 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 650, దక్షిణ కాలువకు 170 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



జగన్‌కు మరో అవకాశం ఇస్తే

ఎవరి ఆస్తులు మిగలవు

- వైసీపీ అభ్యర్థులు ఇద్దరూ అవినీతిలో ఘనులు
- బీజేపీ నేతల విమర్శ



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కావలి, ఏప్రిల్ 6: జగన్‌కు మరో అవకాశం ఇస్తే రాష్ట్రంలో ఎవరి ఆస్తులు కూడా మిగలవని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్డీ విల్సన్ పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం లో వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్రం ఇచ్చిన నిధులన్నీ దారి మళ్లించి అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారని దుయ్యబట్టారు. ఈ ఎన్నికలలో ప్రజలు జగన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే జగన్ రద్దు చేసిన సంక్షేమ పథకాలన్నింటిని పునరుద్ధరిస్తామన్నారు. ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరిగిన సభకు ప్రధాని మోదీ వస్తే సరైన భద్రతా ఏర్పాట్లు కల్పించటంతో విఫలమై డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని రీకాల్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వారిద్దరూ అవినీతిలో ఘనులు

వైసీపీ తరఫున కావలి నుంచి పోటీచేస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న విజయసాయిరెడ్డిలు అవినీతిలో ఘనులని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జీ. భరత్‌కుమార్ విమర్శించారు. ఈ సారి ప్రతాప్‌రెడ్డిని గెలిపిస్తే కావలిలో ఇక ప్రభుత్వ వనరులు ఏవీ కూడా మిగలవన్నారు. విజయసాయికి అవకాశం ఇస్తే నెల్లూరు జిల్లాను కబ్జా చేస్తారని ధ్వజమెత్తారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళి తదితరులు మాట్లాడారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కే. బ్రహ్మానందం, నియోజకవర్గ ఇన్‌చార్జి సీవీసీ సత్యం, నాయకులు పరుసు వెంకటేశ్వర్లు, మందాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

24 ఎస్సీ సంక్షేమ పథకాలు రద్దు చేసిన ఘనత వైసీపీదే..

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు శంకర్



సమీక్షలో రాష్ట్ర పరిశీలకుడు శంకర్, పక్కన చేవూరు

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 6 : నిరంకుశంగా వ్యవహరిస్తున్న వైసీపీ ప్రభుత్వం 24 ఎస్సీ సంక్షేమ పథకాలు రద్దు చేసిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు, పార్టీ జాతీయ సభ్యుడు శంకర్ పేర్కొన్నారు. శనివారం నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఆయన అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులతో సమీక్ష నిర్వహించి పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో పార్టీ పటిష్టంగా ఉందని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రజావ్యతిరేక పార్టీలు, ప్రజల మధ్యనే పోటీ జరుగుతుందని చెప్పారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో పార్టీ పటిష్టమైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు. జిల్లాలోని సంగం బ్యారేజీని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తండ్రి ఆశయాలను తుంగలో తొక్కిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు అవినీతిలో పోటీ పడ్డాయన్నారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా తనను అధిష్ఠానం ఎంపిక చేసిందని అయితే సీడబ్ల్యుసభ్యులు గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన కొప్పోలు రాజును ఎంపిక చేస్తే జిల్లాలోని అన్ని వర్గాలు సహకరిస్తాయని వెల్లడించారు.

ఐఐఎంబీలో ఆత్మకూరు వాసికి బంగారు పతకం



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న సాయి యశ్వంత్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (బెంగళూరు)లో ఆత్మకూరు వాసికి బంగారు పతకం లభించింది. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మారుతీలక్ష్మిల కుమారుడు సాయియశ్వంత్ బెంగళూరులోని ఐఎంబీలో ఎగ్జిక్యూటివ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సును పూర్తి చేశారు. శనివారం జరిగిన 49వ స్నాతకోత్సవంలో పట్టాతో పాటు విశేషమైన ప్రతిభ కనబరిచినందుకు బంగారు పతకం అందుకున్నారు.

ముగిసిన త్యాగరాజస్వామి స్మరణోత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం): నగరంలోని పురమందిరంలో గత నెల 30 నుంచి జరుగుతున్న 59వ శ్రీత్యాగరాజస్వామి స్మరణోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా స్మరణోత్సవ నిర్వాహకులు, బిక్షాటన పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి వై.నాగదేవీప్రసాద్ మాట్లాడుతూ తమ స్మరణోత్సవ సభ సంకల్పం నెల్లూరు నగరంలో ప్రతి ఇంట సంగీతం వినిపించాలన్నదే అన్నారు. అందుకనే ఈ స్మరణోత్సవాలలో స్థానిక సంగీత విద్వాంసులను ప్రోత్సహించామన్నారు. వచ్చే ఏడాది స్మరణోత్సవాలను షష్టి(60) ఉత్సవాలుగా ఘనంగా నిర్వహిస్తామన్నారు.అన్నవరం సత్యనారాయణ, ఆర్‌వీ మల్లికార్జునరావు, ఎస్.మాధవరావు, టీ.వెంకటేశ్వర్లు, దుర్బా జనార్దన్ పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన బీజేపీ నాయకులు

నెల్లూరు (స్టోన్ హౌస్‌పేట), ఏప్రిల్ 6: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 1980 ఏప్రిల్ 6వ తేదీన ఆవిర్భవించిందన్నారు. 44 ఏళ్ల కిందట కొద్ది మందితో ఏర్పడిన పార్టీ ఇప్పుడు ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలున్న స్థాయికి ఎదిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో నిలబడిన ప్రతి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకునేలా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సెల్స్ ఇన్‌చార్జ్ పీ.సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజనేయరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంగడి హుండీ ఆదాయం రూ.8.24 లక్షలు

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 6 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో శనివారం హుండీల లెక్కింపు జరిగింది. 2024 ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు 39 రోజులు భక్తులు వేసిన కానుకలు లెక్కించగా రూ.8,24,668 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమాన్ని ఇన్‌స్పెక్టర్ సుధీర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయం చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఆలయ ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు, వివిధ శాఖల విశ్రాంతి సిబ్బంది, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు : ఎస్ఈ విజియన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 6: విద్యుత్‌శాఖలో కాంట్రాక్టర్లకు డిసెంబరు నెల వరకు పెండింగ్ ఉన్న బిల్లులన్నీ మంజూరు చేశా మని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజియన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మేము ఏమి తప్పు చేశాం మా బకాయిలు ఇవ్వండి అంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు ఆయన స్పందించారు. గతంలో బకాయిలు నిలిచి ఉండగా వాటిలో డిసెంబరు వరకు మంజూరు చేశామని, ఆ తరువాత బకాయిలు మాత్రమే ఉన్నాయని, అవికూడా త్వరలో మంజూరు చేసేస్తామన్నారు. విద్యుత్ పనులకు ఎక్కడా ఆటంకాలు ఉండవని, సజావుగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

మన ప్రభుత్వమే వస్తుంది.. అందరి కష్టాలు తీరుతాయి !



సంగసానిపల్లెలో మహిళలకు కరపత్రాలను అందజేస్తున్న కాకర్ల సురేష్



సీతారామపురంలో దుస్తులు ఇస్త్రీ చేస్తూ...

● ఉదయగిరికోటను పర్యాటక కేంద్రంగా మారుద్దాం

● నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్

సీతారామపురం, ఏప్రిల్ 6: ఈ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఈ మారు వచ్చేది చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని తెలుగుదేశం పార్టీ అని.. అనంతరం మనందరి కష్టాలు తీరి ఉపాధి దొరుకుతుందని ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన సంగసానిపల్లెలో పర్యటించి ఎస్సీ, ఎస్టీ కాలనీలలో గడప గడపకు తిరిగారు. వారి ఇంటిలోపలికి వెళ్లి కింద కూర్చొని వారి కష్టాలను విన్నారు. అవ్వ, తాతలను ఆప్యాయంగా పలకరించారు. తనను ఈ ఎన్నికల్లో ఆశీర్వదించండి అని వేడుకున్నారు. నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటను పర్యాటక కేంద్రంగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేస్తామన్నారు. నిరుద్యోగ యువత కోసం ఉపాధి అవకాశాలు వచ్చేలా చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఈ ఎన్నికలో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం సీతారామపురం పట్టణంలో ప్రధాన రహదారి వెంబడి ప్రచారం నిర్వహిస్తూ ప్రతి దుకాణందారుడు వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. వ్యాపార కష్టనష్టాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇస్త్రీ తోముతున్న తమ్ముడు వద్దకు వెళ్లారు. సురేష్ అన్న.. ఇది చంద్రన్న ఇచ్చిందే అని తెలిపాడు. టీడీపీ ప్రభుత్వంలో రజకులకు చంద్రబాబునాయుడు అండగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశాడు. ఇప్పుడు మమ్మల్ని పట్టించుకున్న నాథుడే లేడని వాపోయారు. త్వర లో మన టీడీపీ ప్రభుత్వం వస్తుందని దిగులు చెందకని ఆయనకు సర్దిచెప్పుకుంటూ ముందుకు ప్రచారం నిర్వహించాడు. కొంచెం ముందుకు వెళ్లగానే చికెన్ దుకాణంలో తమ్ముడికి సహాయంగా చికెన్ కొట్టి, అక్కకు సహాయంగా గరిట తిప్పారు కాకర్ల సురేష్ ఈ విధంగా ఎర్రటి ఎండను సైతం లెక్క చేయక ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. పల్లె జనం ఆయన వెంట నడుస్తూ జై చంద్రన్న.. జైజై కాకర్ల సురేష్ అంటూ జేజేలు కొట్టారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు చింతల శ్రీనువాసులు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, సీతారామపురం ఎంపీటీసీ తమ్మిశెట్టి వెంకటసుబ్బమ్మ, చెన్నకేశవులు, జనసేన నియోజకవర్గ నాయకులు బోగినేని కాశిరావు, సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, జనసేన మండలాధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి, జాషువా, సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, ఆదినారాయణ, చంద్రరెడ్డి, వార్డు నెంబర్ తోట మనోజ్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తా..

ఉదయగిరి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదిస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం రాత్రి పుల్లాయపల్లి, బోడబండ, అన్నంపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంతో పాటు వలస నివారణకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు తనకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, నాయకులు పోకల ప్రభాకర్‌రెడ్డి, చింతల శ్రీను, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుల్లాయపల్లిలో కరపత్రాలు పంచుతున్న కాకర్ల సురేష్

టీడీపీలోకి సాగరం ఎంపీటీసీ

అనంతసాగరం, ఏప్రిల్ 6: స్థానిక బీట్-1 ఎంపీటీసీ సభ్యురాలు రాపూరు సుజాతమ్మ శుక్రవారం తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. ఆత్మకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు.

నేడు ఆత్మీయ సమావేశం

మర్రిపాడు, ఏప్రిల్ 6: టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్‌నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. మర్రిపాడులోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో జరిగే సమావేశానికి మాజీ మంత్రి, ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 6: మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన మూడు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.30వేలను శనివారం కంచి పరమేశ్వరరెడ్డి అందజేశారు. అంతకుముందు 11వ వార్డు పరిధిలోని పులిమి నారాయణరెడ్డి, 22వ వార్డులో పొంగూరు రమణమ్మ, 23వ వార్డులో తాళ్ల వెంగయ్య కుటుంబాల సభ్యులను పరామర్శించారు. కష్టకాలంలో తమకు ఆర్థిక సాయం అందజేసిన సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్లపైనే మురుగునీరు

● పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఏఎస్ పేట: దోమల నివారణకు గతంలో మండలానికి రెండు ఫాగింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. వచ్చిన ఏడాది మాత్రమే కొద్ది రోజులు గ్రామాల్లో ఫాగింగ్ నిర్వహించారు. అనంతరం ఆ యంత్రాలు మాయం అయ్యాయి. దీంతో దోమలు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో పరిశుభ్రత లోపించడంతో ఫాగింగ్ లేకపోవడంతో దోమలు ప్రబలుతున్నాయి.దోమలు ఎక్కువగా నిల్వ నీటిలో గుడ్లు పెట్టి సంతానాన్ని ఉత్పత్తి చేస్తాయి. దీంతో గ్రామాల్లో ఇళ్లలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటారు.కానీ ఏ ఎస్‌పేటలో రోడ్డు విస్తరణలో భాగంగా ఆరునెలలు క్రితం రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురికి కాలువలను ధ్వంసం చేశారు.దీంతో మురుగు నీరు రోడ్లపై చేరింది. కాలువల కోసం తవ్విన గుంతలతో మురుగు నీరుపారే అవకాశం ఉండడంతో దోమలు ప్రబలుతున్నాయి. ఇటీవల వాటి బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

సహకార సంఘాల్లోనూ ఆన్‌లైన్ సేవలు



కంప్యూటరీకరణ పనులను పరిశీలిస్తున్న తిరుపతయ్య

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 6: జిల్లాలోని 78 ప్రాథమిక సహకార సంఘాల్లో త్వరలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ అధికారి కె.తిరుపతయ్య తెలిపారు. శనివారం స్థానిక కొట్టాలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించి కంప్యూటరీకరణ పనులు తనిఖీ చేసి మాట్లాడారు. సంఘం లావాదేవీలన్నీ ఆన్‌లైన్ ద్వారా జరుగుతాయన్నారు. సహకార సంఘాల రిజిస్టర్ ఆదేశాల మేరకు ర్యాండమ్ తనిఖీలో భాగంగా రికార్డుల కంప్యూటరీకరణను చేపడతామని చెప్పారు. కార్యక్ర మంలో సబ్ డివిజనల్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ వీ.శ్రీనివాసరెడ్డి, ఆడిటర్ కె.సుబ్రహ్మణ్యం, సీఈవోలు పోలయ్య, రత్తయ్య, శ్రీను, సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి కాంగ్రెస్ అభ్యర్థిపై ఫిర్యాదు



ఏఐసీసీ పరిశీలకుడికి వినతిపత్రం అందజేస్తున్న రమేష్‌నాయుడు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 10: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి సోము అనిల్‌కుమార్ రెడ్డిపై ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దుద్దుకూరి రమేష్ నాయుడు శనివారం నెల్లూరు ఇందిరాభవన్‌లో ఏఐసీసీ పరిశీలకుడు శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి అధిష్టానం సూచిస్తున్న కార్యక్రమాలను నియోజకవర్గంలో చేపడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన వారికి టిక్కెట్టు ఇవ్వకుండా ఇటీవల పార్టీలో చేరిన వారికి టిక్కెట్టు ఇవ్వడం దారుణమన్నారు. రూ.25లక్షలు వెచ్చించి టిక్కెట్టు కొనుగోలు చేశానని అభ్యర్థే చెప్పడం దారుణమన్నారు. నియోజకవర్గ సరిహద్దులు తెలియని వ్యక్తికి టిక్కెట్టు ఇస్తే ఎలా విజయం సాధిస్తారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జాబితాను పునఃపరిశీలించి కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న నిజమైన కాంగ్రెస్ నాయకులకు టిక్కెట్టు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



వింజమూరులో మిఠాయిలు పంచుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

వింజమూరు, ఏప్రిల్ 6: మండలకేంద్రంలోని పొట్టిశ్రీరాములు బస్టాండ్ సెంటర్‌లో భారతీయ జనతాపార్టీ మండలాధ్యక్షుడు డేగ మధుయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ పతాకావిష్కరణ చేసి నాయకులు, కార్యకర్తలకు మజ్జిగ, స్వీట్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు తిప్పిరిబోయిన వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు గంగిశెట్టి రత్తయ్య, రాజా సత్యం, కార్యదర్శులు కోనేటి శ్రీను, సేగు శ్రీను, మైనార్టీ మండలాఅధ్యక్షుడు మహబూబ్, సీనియర్ నాయకులు గని రమణయ్య, విశ్వహిందూ పరిషత్ నాయకులు పొన్నూరు ప్రకాష్, ఆర్ఎస్ఎస్ బాధ్యులు బొగ్గవరపు భాస్కర్, గుణ్ణం మాధవరెడ్డి గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్-ఏ-ఖదర్



ఉదయగిరి, ఏప్రిల్ 6: పట్టణంతోపాటు బిజ్జంపల్లి, పుల్లాయపల్లి, వెంగళరావునగర్, గండి పాళెం, దాసరిపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లోని మసీదుల్లో శనివారం ముస్లిం సోదరులు షబ్-ఏ-ఖదర్ సందర్భగా రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు ఖురాన్ సందేశం ఇచ్చారు. ఈ పవిత్రమైన రోజున ప్రవక్త మహమ్మద్ అవతరించిన రోజు అని తెలిపారు. అనంతరం మసీదుల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

అనంతసాగరం: పవిత్ర రంజాన్ మాసంలోని షబే ఖదర్ వేడుకలను ముస్లిం సోదరులు శనివారం రాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతేక నమాజులో పాల్గొన్నారు. మసీదులకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలీమ్, ఇమామ్‌లు రంజాన్ ప్రాముఖ్యతను వివరించారు.

బెడుసుపల్లి వద్ద 18 మద్యం సీసాల పట్టివేత

అనంతసాగరం, ఏప్రిల్ 6: మండలంలోని బెడుసుపల్లి రోడ్డు వద్ద శనివారం పోలీసులు చేపట్టిన తనిఖీలో 18 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. కొత్తపల్లికి చెందిన కే.కిష్టయ్య అనంతసాగరం నుంచి మద్యాన్ని తరలిస్తుండగా అనుమానించి అతన్ని తనఖీ చేసి వాటిని స్వాధీనం చేసు కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మస్తాన్ తెలిపారు.

...శనివారం టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాల యంలో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో వారు టీడీపీలో చేరగా, వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పా ర్టీలో చేరినవారిలో ఉలవపాడు పంచాయతీ హైస్కూల్ సంఘానికి చెందిన దాసరి వెంకటరావు, పాలకుర్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలు ఎస్సీ, ఎస్టీ కు టుంబాల వారు, కందుకూరుకి చెందిన ఆర్యవైశ్యులు అప్పల సుబ్రహ్మణ్యం, అప్పల మురళీ కృష్ణ కుటుంబాలు, వలేటివారిపాలెం మాజీ ఎంపీపీ సలహా దారు బండారు సోమరాజు, నూకవరానికి చెందిన దాచర్ల రాఘవ ఉన్నారు.

నృసింహుడి ఆశీస్సులతో విజయం సాధిస్తా : ఇంటూరి



వలేటివారిపాలెం : మాలకొండలో పూజలు చేస్తున్న నాగేశ్వరావు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 6 : లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో అటు రాష్ట్రంలోనూ ఇటు కందుకూరులోనూ టీడీపీ విజయం సాధిస్తుందని కందుకూరు టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఇంటూరి తన సతీమణి సౌజన్యతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం కొండకింద ముఖ ద్వారం వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలకొండలో ఏళ్లతరబడి నెలకొన్న ఇంటి స్థలాల సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. అలాగే చిరువ్యాపారుల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాదాల లక్ష్మీనరసింహ, గొట్టిపాటి హరికృష్ణ, పరిటాల భాస్కర్‌రావు, వలేటి నరసింహం, కాకుమాను హర్షకుమార్, పొడపాటి నరసింహం పాల్గొన్నారు.

● **జోరుగా ప్రచారం**

మండలంలోని మాలకొండ, అయ్యవారిపల్లె, రామలింగాపురం, చుండి, కాకర్లవారిపాలెం గ్రామాల్లో శనివారం ఇంటూరి జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కనిగిరి ప్రజలు బుర్రాను భరించలేక పోవడంతో కందుకూరు పంపించినట్లు ఎద్దేవా చేశారు. కాగా ఇంటూరి నాగేశ్వరావుకు ఆయా గ్రా మాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **టీడీపీలోకి వలసలు**

కందుకూరు : నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు ఆపార్టీని వీడి...

మండువేసవిలో మంచుకురిసెను!



పగలంతా భానుడు భగ్గుమంటున్నా ఉదయంపూట మంచుదుప్పటి ఆహ్లాదపరుస్తోంది. శనివారం తెల్లవారుజామున 4 నుంచి మంచు కురుస్తుండగా ఉదయం 7 గంటలకు కూడా మంచుతెరలు వీడటం లేదు. మంచు ప్రభావంతో లింగసముద్రంలో రోడ్లపై ఎదురుగా ఏముందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు లైట్ల వెలుగుల్లో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ చల్లటి వాతావరణంలో ప్రజలు సేద తీరారు. అయితే పగలు వేడిగాలులతో కూడిన ఎండ, రాత్రి వేళ సెగ ఉండటంతో ఇబ్బంది పడ్డారు.

- లింగసముద్రం

మాలకొండ ఆదాయం రూ. 8,62,544

వలేటివారిపాలెం, ఏప్రిల్ 6 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 8,62,544 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 6,450, కుంకుమార్చన ద్వారా రూ. 20,680, వివాహాల ద్వారా రూ. 3 వేలు, తలనీలాల ద్వారా రూ. 27,400, వాహనపూజల ద్వారా రూ. 2,960, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,81,100, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 9,80, రూముఅద్దెల ద్వారా రూ. 26,280, కవర్ల ద్వారా రూ. 4,800, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,74,865, అన్నదానం ద్వారా రూ. 36,029, విరాళా ద్వారా రూ. 48 వేలు ఆదాయం లభించిందన్నారు.

వలంటీరు రాజీనామా

వలేటివారిపాలెం, ఏప్రిల్ 6 : వలేటివారిపాలెంలో గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్ కూచిపూడి బ్రహ్మయ్య శనివారం రాజీనామా చేశాడు రాజీనామా పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి స్వాతికి అందజేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

రాజీనామా.. అంతలోనే ఉపసంహరణ

కొండాపురం, ఏప్రిల్6: టీడీపీ మండల కన్వీనర్ మామిళపల్లి ఓంకార్ వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. అనంతరం జిల్లా నేతల సూచనలతో పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వర్లు రెడ్డి కొండాపురంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమై చర్చించారు. అందరి అభిప్రాయం మేరకు ఓంకార్ తన రాజీనామాను ఉపసంహరించుకోవాలని కోరగా, ఆయన అంగీకరించారు. ఈ కార్యక్రమంలో కాకర్ల వెంకట్, గంటా నరసింహులు, యారవ క్రిష్టయ్య, చెరుకూరు వెంకటాద్రి, దామా మహేశ్వరరావు, పోలినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

635 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, ఏప్రిల్ 6 : స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు మొత్తం 733 పొగాకు బేళ్లను తీసుకువచ్చారు. వేలంలో 11 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 635 బేళ్లను కొనుగోలు చేశారు. నోసేల్- 11, నో బిడ్-62, సీఆర్-15, జంపింగ్ లాడ్స్- 10 కారణాలతో 98 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.231, కనిష్ఠ ధర రూ.220 సగటు ధర రూ.229.15గా నమోదయినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్ కుమార్ తెలిపారు.

కోవూరుపల్లి పీహెచ్‌సీ తనిఖీ

బిట్రగుంట, ఏప్రిల్ 6: బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీని శనివారం జిల్లా క్షయ, కుష్ఠు నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఇతర గదులను ఆయన పరిశీలించారు. ఇంటింటి సర్వేపై వైద్యులు జీ. హారిక, నిత్యప్రశాంతి, సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు శ్రావణ్ కుమార్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ నాయకులు

కావలిటౌన్, ఏప్రిల్ 6: వైసీపీ ప్రభుత్వం ముస్లింలను విస్మరించిందని, మైనార్టీలకు సంక్షేమ పథకాలు అందించింది టీడీపీనేనని పలువురు మైనార్టీ నేతలు పేర్కొన్నారు. శనివారం ముసునూరులోని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం మైనార్టీలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. చెప్పుకునేందుకు ఏమీ లేకనే ఇమామ్‌లకు అర్థం తెలియని వారు, ఉర్దూ తెలియని వారు టీడీపీ నేతలను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. నెల్లూరు సిటీలో నారాయణపై ఎవరైనా ఓడిపోతారన్న భయంతో మైనార్టీకి టికెట్ ఇచ్చి మైనార్టీలపై ప్రేమ ఉన్నట్లు బిల్డప్ ఇవ్వడం ముస్లింలు గమనిస్తున్నారని వారు పేర్కొన్నారు.సమావేశంలో మైనార్టీ నేతలు అబ్దుల్ రహీం, ఖాదర్ బాష, అన్సర్, హజరత్, ఎస్‌కె రఫీ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

జీతాల బకాయిలు చెల్లించాలి

కావలిటౌన్, ఏప్రిల్ 6: మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు జీతాల బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నేతలు శనివారం మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. అనంతరం సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కార్మికులకు రెండు నెలల జీతాలు రావాల్సివుందని, సమ్మెకాలం జీతం, పండగ అడ్వాన్స్, ఇంత వరకు ఇవ్వలేదన్నారు. కమిషనర్ జోక్యం చేసుకుని కార్మికుల జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు తురక శీనయ్య, ఒంగోల్ రమేష్, పోలయ్య, కే బాబు తదితరులు పాల్గొన్నారు.

రమేష్ కుటుంబ సభ్యులకు పసుపులేటి పరామర్శ



రమేష్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న పసుపులేటి సుధాకర్

బిట్రగుంట, ఏప్రిల్ 6: : బోగోలు మండలం ఏబీకండ్రిక పంచాయతీకి చెందిన డమ్ము రమేష్ (42) మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను శనివారం కావలి స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ పరామర్శించారు. రమేష్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రమేష్ ఇద్దరు చిన్నారులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట పసుపులేటి వెంకటేశ్వర్లు, పీ.కృష్ణ, వెంకటరమణయ్య, మాధవ్, ప్రత్యూష్, హర్షవర్ధన్ తదితరులు ఉన్నారు.

నూనె అవినాష్‌కు నివాళులు

కావలిటౌన్ : అభయం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నూనె మోహన్ కుమారుడు నూనె అవినాష్ ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో శనివారం ఆయన నివాసానికి కావలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా తత్పరుడు నూనె మోహన్ కుమారుడు అకాల మృతి తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఆయన మృతి తీరని లోటని పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : సబ్ కలెక్టరు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు విద్యాధరి

కందుకూరు, ఏప్రిల్ 6: ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కందుకూరు సబ్ కలెక్టరు జీ విద్యాధరి హెచ్చరించారు. శనివారం స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో ఆమె గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో, సెక్టార్ ఆఫీసర్లతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. రాజకీయ పార్టీలు స్వీయనియంత్రణతోపాటు నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎక్కడా నిబంధనల అతిక్రమణ జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నియోజకవర్గంలో 55 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామని, అక్కడ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంతో పాటు పోలింగ్‌రోజు పటిష్టమైన భద్రతను ఏర్పాటుచేస్తామని ఆమె తెలిపారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక



జనసేనలో చేరిన వారితో మనుక్రాంత్‌రెడ్డి

జలదంకి, ఏప్రిల్6: మండలంలోని దాసరిఅగ్రహారం గ్రామానికి చెందిన 30కుటుంబాలు జనసేనలో చేరాయి. నెల్లూరులోని జనసేన కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి సమక్షంలో వీరు పార్టీ కండువాలు వేసుకున్నారు. వైసీపీ నుంచి జనసేనలో చేరిన వారిలో క్రిష్ణారావు, మాధవరావు, తోట మాల్యాద్రి, పవన్, సురేష్, రామయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నేతలు కొట్టే వెంకటేశ్వర్లు, నిమ్మలపల్లి రామ్‌చైతన్య పాల్గొన్నారు.

మౌలిక వసతులు లేక ప్రజల ఇక్కట్లు



ఎన్నికల ప్రచారంలో బీద గిరిధర్ తదితరులు

అల్లూరు, ఏప్రిల్ 5 : మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన అల్లూరు బీసీ కాలనీ, రజక కాలనీ, గాంధీకాలనీ, కట్టకింద అరుంధతీయవాడల్లో పర్యటించారు. ఆయన వెంట కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చందన్‌రెడ్డి కూడా ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, సామంతుల పరంధామరెడ్డి, కత్తుల శ్రీకాంత్, నజీర్‌బాషా పాల్గొన్నారు.

మాలేపాటి ఎన్నికల ప్రచారం



ప్రచారంలో మాలేపాటి తదితరులు

బిట్రగుంట (దగదర్తి) ఏప్రిల్ 6: కావలి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మాలేపాటి సుబ్బానాయుడు శనివారం దగదర్తి మండలంలోని పలు పంచాయతీల్లో శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ కరపత్రాలు అందచేశారు. ఆయన వెంట నాయకులు అల్లం హనుమంతరావు, జలదంకి శ్రీహరినాయుడు, మల్లికార్జునరెడ్డి, పలువురు కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు. కాగా మండల పార్టీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, మండల ఇన్‌చార్జి దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డిలు శనివారం బోగోలు మండలం ఏనుగులబావి పంచాయతీలో ప్రచారం చేశారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యేగా కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వంటేరు ప్రసన్న, పంది శ్రీనివాసులు, వెంకయ్య, యల్లమ్మ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా : ప్రశాంతిరెడ్డి


విడవలూరు: దంపూరులో కరపత్రం అందజేస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


కొడవలూరు : ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రశాంతిరెడ్డి

విడవలూరు, ఏప్రిల్ 6: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి ఆదరించండి గ్రామీణాభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతానని కోవూరు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని దంపూరులో స్థానిక టీడీపీ నాయకులు కొమ్మి శ్రీధర్‌నాయుడు, దూది విజయరాఘవన్, చేవూరి రాం ప్రసాద్, రాజారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జనసేన నాయకులు చప్పిడి శ్రీనివాసులురెడ్డి, గుడి హరిరెడ్డి, కమతం శ్రీనాథ్‌యాదవ్, బీజేపీ నాయకులు కనుపర్తి నాగేంద్రలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేసిన ప్రశాంతిరెడ్డి గ్రామంలోని కాలనీల్లో ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరించి గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

టీడీపీలో భారీగా వైసీపీ కార్యకర్తల చేరిక

గాదెలదిన్నె గ్రామంలో వైసీపీకి చెందిన యలంపల్లి దిలీప్, తగ్గిళ్ల కరుణాకర్‌తో పాటు సుమారు వందమంది కార్యకర్తలు ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే దంపూరు గ్రామంలోని మిక్సిడ్ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు డాన్ శివ ఆధ్వర్యంలో సుమారు 50 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల శ్రీనివాసులు, పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఉచ్చూరు సుధీర్‌రెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డికి ప్రజల నీరాజనాలు

కొడవలూరు: మండలంలో దాసరిపాలెం, యల్లాయపాలెంలో శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రజలు నీరాజనాలు పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, గ్రామీణ ప్రాంతాల దశ దిశా మారుస్తానన్నారు. యల్లాయపాలెం గ్రామానికి శ్మశాన వాటిక, యల్లాయపాలెం నుంచి పాటూరుకు సిమెంటు రోడ్డు, ఇళ్లు లేని నిరుపేదలకు స్థలం కేటాయించి ఇళ్లు నిర్మిస్తామన్నారు. చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి అన్నారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కే విజయభాస్కర్‌రెడ్డి, కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, కేతు వెంకటరమణారెడ్డి, గరికపాటి రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి ఓటమి ఖాయం : సోమిరెడ్డి


పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 6: సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఓటమి ఖాయమని మాజీ మంత్రి, సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. వేదాయపాళెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో శనివారం సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీలో చేరారు. మనుబోలు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 15 కుటుంబాలు సోమిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. చెరుకుముడి పంచాయితీకి చెందిన బొడ్డు మస్తానయ్య, ధనుంజయ, ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పంచాయితీ గోపాలపురానికి చెందిన 24 కుటుంబాలు, రాంనగర్‌కు చెందిన 24 కుటుంబాలు, బలిజపాళెంకు చెందిన 18 ముస్లిం కుటంబాలు, రాంనగర్‌కు చెందిన 18 కుటుంబాలు, ఇంకా గోపాలపురానికి చెందిన 17 కుటుంబాలు రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి అమీర్‌బాషా ఆధ్వర్యంలో ముత్తుకూరు మండలం బలిజపాళెంకు చెందిన 12 కుటుంబాలు పార్టీలో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

● **వెంకటాచలం:** మండలంలోని కాకుటూరులో శనివారం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వైసీపీ నాయకులతో సహా 30 కుటుంబాలు వైసీపీని వీడి సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల నాగేంద్రప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, సర్పంచ్ డబ్బుగుంట వెంకమ్మ, నాయకులు డబ్బుగుంట సురేంద్ర, మల్లి కృష్ణయ్య పాల్గొన్నారు.

● **మనుబోలు:** మండలంలోని జట్లకొండూరు పంచాయతీలో శనివారం సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొండూరుసత్రంకు చెందిన పలు కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు పసుపులేటి శ్రీనువాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డితోనే పేదల సంక్షేమం

కొడవలూరు ఏప్రిల్ 6: నియోజకవర్గంలో పేదల సంక్షేమం కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు అన్నారు. కమ్మపాలెం పంచాయతీ పరిధిలోని సంజీవ్‌నగర్‌లో శనివారం ప్రచారం నిర్వహించారు. ముందుగా బ్రహ్మంగారి ఆలయంలో పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, బి రమేష్‌బాబు, కె కిషోర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

బుచ్చిరెడ్డిపాళెం: 15వ వార్డులో శనివారం ఆ వార్డు ఇన్‌చార్జ్ బండ్ల కొండయ్య టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ప్రశాంతిరెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అలాగే జొన్నవాడలో సర్పంచ్ పెంచలయ్యతోపాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఉమ్మయ్యస్వామి, పెంచలయ్య, ఏడుకొండలు, నరసింహులు పాల్గొన్నారు.

జగన్ పలకరింపు

కోవూరు : వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి కావలి వెళ్తూ కోవూరు సమీపంలో పెద్ద సంఖ్యలో గుమికూడిన నాయకుల్ని, కార్యకర్తల్ని పలకరించారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజనబాబురెడ్డి, పలువురు నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.

3 ఎకరాల గడ్డివామి దగ్ధం

బుచ్చిరెడ్డిపాళెం : వవ్వేరులో వెంకటేశ్వర్లుకు చెందిన 3 ఎకరాల గడ్డివామి శనివారం దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వవ్వేరు చేరుకుని మంటలు అదుపు చేశారు. గడ్డివామి దగ్ధం కావడంతో రూ.40వేలు నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

పింఛన్ ఆగితే మూడు నెలలు కలిపి ఇస్తాం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వినోద్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 6: ఎన్నికల నేపథ్యంలో మే, జూన్ నెలల పింఛన్ పంపిణీలో ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే నూతనంగా ఏర్పడనున్న కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు జూలై 1వ తేది పెరిగిన రూ.4 వేల పింఛన్‌తో పాటు ఇవ్వని రెండు నెలలది కలిపి రూ.10వేలు ఇంటి వద్దకే వచ్చి అందిస్తారని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. 45వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెల్లూరు ఎంపీగా వీపీఆర్‌ను, నగర ఎమ్మెల్యేగా నారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

వెంకటాచలం : వెంకటాచలంలో శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్, జిల్లా కార్యదర్శి అల్లూరు ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గ బీజేపీ సమన్వయకర్త రవీంద్రారెడ్డి, ఓబీసీ మండలాధ్యక్షుడు అనసాపురం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను సర్వేపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కాకుటూరు రవీంద్రరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండలాధ్యక్షుడు పెనమల్లి వెంకటకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తీరుపై సామాన్యుడి నిరసన

● కేసు నమోదు చేసిన పోలీసులు


బస్సుకు అడ్డంగా పడుకుని నిరసన తెలుపుతున్న ప్రసాద్‌గౌడ్

విడవలూరు, ఏప్రిల్ 6: కావలిలో జగన్మోహన్‌రెడ్డి తలపెట్టిన సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను కేటాయించడం పట్ల సామాన్యుడు తిరగబడ్డాడు. శనివారం సిద్ధం సభకు వెళుతున్న ఆర్టీసీ బస్సును అన్నారెడ్డిపాలెంకు చెందిన ప్రసాద్‌గౌడ్ అడ్డుకుని రోడ్డుపై పడుకుని నిరసన తెలిపాడు. పెళ్లిళ్ల సీజన్‌లో గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు లేక నిరుపేదలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, ఆర్టీసీ బస్సు అద్దాలను పగలగొట్టాడు. దీంతో ఆర్టీసీ సిబ్బందికి నిరసనదారుడికి మధ్య వాదోపవాదాలు జరిగాయి. బస్సు సిబ్బంది ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ రాజు విచారణ జరిపి కేసు నమోదు చేశారు.

పొలం దారిని అడ్డుకుంటున్నారు..

● రైతు ఆవేదన

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 6: వైసీపీ నాయకుల అండ దండలతో కొందరు పొలం దారిని అడ్డుకుంటున్నారని రైతు అన్నం రమణయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని పేడూరు గ్రామ పొలాల్లో అన్నం రమణయ్య శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తన పొలానికి ఆనుకుని పారుదల కాలువ ఉందని, ఆ కాలువ దాటి పొలానికి వెళ్లేందుకు బండ్ల జయమ్మ, బండ్ల పోలయ్య, బండ్ల హరిబాబు, పోసిన వెంకట్‌రమణ్య, రాధిక, సుజాత అడ్డుకుంటున్నారని, దీంతో పొలం సాగు చేసుకోలేకపోతున్నామని, ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

మనుబోలు ఇన్‌చార్జి ఎంపీడీవోగా సుధాకర్

మనుబోలు, ఏప్రిల్ 6: మండలానికి ఇన్‌చార్జి ఎంపీడీవోగా సైదాపురం ఎంపీడీవో సుధాకర్‌ను ఎన్నికల కమిషన్ నియమించింది. ఇప్పటివరకు ఈవోఆర్‌డీగా పనిచేస్తున్న జీవి ఎస్‌వి ప్రసాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనను మాతృస్థానానికి పంపి, సుధాకర్‌ను నియమించారు.

నేతల సేవకే ప్రాధాన్యం!


ఆత్మకూరు బస్టాండులో బస్సులు కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

- ముఖ్యమంత్రి సభకు 400 ఆర్టీసీ బస్సులు
- పోలీసులంతా కూడా బందోబస్తుకు..
- నరకంగా మారిన ప్రయాణం
- ప్రజలకు తప్పని అవస్థలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 6: కావలిలో ముఖ్యమంత్రి సభ జరిగితే జిల్లా వ్యాప్తంగా ప్రజలు నరకం చూశారు. ముఖ్యమంత్రి రాజకీయ సభ కోసం రీజియన్‌లోని అన్ని డిపోలకు చెందిన 400కు పైగా ఆర్టీసీ బస్సులను తరలించారు. ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్య తక్కువగా ఉంటుందనో, బస్సులను రద్దు చేస్తున్నామన్న ప్రకటనలు కూడా ఇవ్వకపోవడంతో శనివారం ప్రయా ణాలు చేస్తున్న ప్రజలు బస్సుల కోసం మండుతున్న ఎండలో ఎదురుచూపులతో విసిగి పోయారు. బస్టాండ్లలో గంటల తరబడి ఉక్కపోతతో అలమటించారు. విచారణ కేంద్రంలో బస్సులు ఎప్పుడు వస్తాయన్న దానిపై స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడంతో ప్రజలు బస్సులు వస్తాయా... రావా.... ప్రయాణాలు వాయిదా వేసుకో వాలా... తెలియక ఇబ్బందులు పడ్డారు. దీంతో పల్లె ప్రాంతాల ప్రజల కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. అప్పుడప్పుడు వచ్చే ఒకటి రెండు బస్సుల్లో వందల సంఖ్యల్లో ప్రయాణికులు ఇరు క్కుని ఒకరిపై ఒకరు నిల్చోని ప్రయాణాలు చేశారు. కావలి ప్రాంతం నుంచి ఆత్మకూరుకు వెళ్లే ప్రయాణికులు నెల్లూరుకు వచ్చి నెల్లూరు నుంచి ఆత్మకూరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరుపతికి వెళ్లే వారు నాయుడుపేట వరకు చెన్నై బస్సులు, రైళ్లలో వెళ్లి అక్కడ నుంచి శ్రీకాళహస్తికి ఆటోలో అక్కడ నుంచి బస్సుల్లో ప్రయాణాలు చేశారు. చెన్నైకు వెళ్లాల్సిన వారు సూళ్లూరుపేట వరకు ఎలాగోలా చేరుకొని అక్కడ నుంచి మెమూ రైళ్లలో ప్రయాణాలు చేశారు. ఇలా ముఖ్యమంత్రి రాజకీయ సభ సామాన్య ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపింది.

పోలీసులందరూ సభకే..

జిల్లాలోని పోలీసుశాఖలో ఉన్న అధికారులు, సిబ్బంది దాదాపుగా అందరినీ ముఖ్యమంత్రి రాజకీయ సభ బందోబస్తు సభకు కేటాయించడంతో జిల్లాలో పోలీసు స్టేషన్‌లు ఖాళీగా మారాయి. స్టేషన్‌లో ఒకరిద్దరు మాత్రమే కన్పించారు. ఇక నగరంలో ఓ పక్క ఎండ తీవ్రత మరో పక్క ట్రాఫిక్ జామ్‌తో నగర ప్రజలు పడ్డ బాధలు వర్ణనాతీతం. నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో కొందరు వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు ఎటుపడితే అటు నడపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధాన కూడళ్లలో నాలుగు వైపుల వాహనా లు నిలిచి పోవడంతో ట్రాఫిక్‌తో ప్రజలు అవస్థలు పడ్డారు. అసలు విషయం ఏమిటని తెలుసుకున్న ప్రజలు నాయకుల సేవలు కోసం సామాన్య ప్రజలను ఇంతలా ఇబ్బందులకు గురిచేస్తారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.


వీఆర్‌సీ సెంటర్‌లో నిలిచిపోయిన వాహనాలు

రాజకీయ కుట్రతో అన్న క్యాంటీన్ల మూత

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ


ఎన్నికల ప్రచారంలో పొంగూరు నారాయణ


ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి నారాయణ, అజీజ్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 6 : రాజకీయ లబ్ధి కోసం కుట్రపన్ని అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేసిందని మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం ఆయన 8, 44, 46వ డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నారాయణ మాట్లాడుతూ వైసీపీ రాజకీయ ఎత్తుగడలను ప్రజలు నమ్మేపరిస్థితి లేదని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ముస్లిం మైనార్టీల ఉన్నతికి కృషి

ముస్లిం మైనార్టీల ఉన్నతికి తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలోని 15వ డివిజన్ బాలాజీనగర్‌లో మైనార్టీ నేతలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. సామాజిక పింఛన్‌ల పంపిణీ విషయంలో వైసీపీ వృద్ధులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వలంటీర్ల సేవలను ఎన్నికల కమిషన్ నిలిపివేసి అధికారులతోనే పంపిణీ చేయాలని ఆదేశించిందన్నారు. అయితే దీన్ని కూడా రాజకీయంగా వాడుకునేందుకు వైసీపీ పన్నిన కుట్రలు ఫలించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్, మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీలోకి రావడం దైవసంకల్పం

● రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి


శ్రీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న గౌడ్ కులస్తులు

నెల్లూరురూరల్, ఏప్రిల్ 6 : అమరావతి రైతులను పలకరించానని జగన్, విజయసాయిరెడ్డిలు తనను లక్ష్యంగా చేసుకున్నారని, చివరకు దైవసంకల్పంతో టీడీపీలోకి వచ్చి తిరిగి నెల్లూరు రూరల్ నుంచే పోటీచేస్తున్నానని టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో కుడుముల నాగేశ్వరరావుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన గౌడ్ కులస్తుల నియోజకవర్గ స్థాయి సంఘీభావ ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గౌడ్‌కులస్తులు ఆయనను ఘనంగా సత్కరించారు. అలాగే ఎమ్మెల్యే కార్యాలయంలో 36వ డివిజన్‌కు చెందిన శ్రీధర్‌నాయుడు, నరసారెడ్డి, అరిగెల సాగర్‌లు టీడీపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా మండలంలోని కొమ్మరపూడి, ములుముడి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

వేపదొరువును సుందరంగా మార్చాం

● టీడీపీ నేత శ్రీనివాసులురెడ్డి


స్థానికులతో మాట్లాడుతున్న కోటంరెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 6 : చెత్తకుప్పలతో నిండి ఉన్న వేపదొరువును సుందరమైన పార్కుగా తీర్చిదిద్దింది తెలుగు దేశం పార్టీ అని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శనివారం 14వ డివిజన్ వేపదొరువు, తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణ, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తానే మస్తాన్, ఎలమందరెడ్డి, సుభాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లపై పార్కింగ్ ఏర్పాటు : కమిషనర్

నెల్లూరురూరల్, ఏప్రిల్ 6 : నెల్లూరులోని ప్రధాన రోడ్లు, కూడళ్ల వద్ద వాహన పార్కింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు, నిర్మాణాలు చేపట్టాలని ఎన్‌ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు నిలువరించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల వాహన పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డుకు ఒకవైపు మొక్కలు పెంచేందుకు ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో వెంకటరమణయ్య, వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు


అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేస్తున్న రాంబాబు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 6 : వేసవి కాలంలో ప్రజలకు వడదెబ్బ తగలకుండా స్టోన్‌హౌస్‌పేటలో నెల్లూరు జిల్లా రైస్ క్యాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్, శ్రీషణ్ముఖ బ్రోకర్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రంను శనివారం ఇంటిలిజెన్స్ రీజియన్ అదనపు ఎస్పీ వీఎస్ రాంబాబు ప్రారంభించారు. బాటసారులకు అల్పాహారం, మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా రైస్ క్యాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పేగు.షణ్ముఖరావు, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, వెలుగొండయ్య, స్పందన ప్రసాద్, ఎంపి.ఆంజేయులు, కోట గురుబ్రహ్మం, దర్శి హరికృష్ణ, ఆర్‌కేటీ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయండి: ఈఈ

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 6: నగరంలో విద్యుత్ బకాయిలను వేగవంతం చేసి వంద శాతం వసూళ్లకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విద్యుత్ శాఖ నగర ఈఈ సోమశేఖర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన చాంబర్‌లో నగర పరిధిలోని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ 3 నెలలు బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్ తొలగించాలన్నారు. వేసవిలో అద నపు లోడు అవసరమైన ప్రాంతాల్లో ఇంపుర్‌మెంట్ ట్రాన్సఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లలో విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశం లో డీఈలు మధుసూదన్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్జీ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 6 : నగరంలోని చిల్డ్రన్స్ పార్కు సమీపంలో ఉన్న కిడ్జీ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. విద్యాసంస్థల కోఆర్డినేటర్ దినేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఈ వేడుకలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపశ్రీ, కిండర్ గార్డెన్ ఇన్‌చార్జి ప్రభ, జ్యోతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ నేతల ప్రచారం

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 6 : ఆర్‌పీఐ పార్టీ ఎంపీ అభ్యర్థి మాబు కలెక్టరేట్ నుంచి శనివారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ ప్రచార కార్యక్రమంలో నాయకులు మధుసూదన్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత : పిట్టి


పిట్టి మల్లికార్జున

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 6 : అందరికీ ఆరోగ్యం అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వా నిదని ప్రముఖ శ్వాసకోశ వైద్యని పుణుడు పిట్టి మల్లిఖార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ 'నా ఆరో గ్యం నా హక్కు' అనే నినాదాన్ని ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నియామకంతో పాటు వైద్య పరికరాలు, రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రైవేట్ వైద్యం ఖర్చుతో కూడుకున్నదని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్ఠం చేయాలని తెలియచేశారు.

స్వతంత్రానంతర ఎన్నికల చరిత్రలో తిరుపతిలో తొలిసారి కాంగ్రెస్ అభ్యర్థి బరిలో లేకుండా ఎన్నికలు జరగబోతున్నాయి. తిరుపతి ఎంపీ, అసెంబ్లీ స్థానాలను ఇండియా కూటమిలో భాగస్వాములైన మిత్రపక్షాలకు కేటాయించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అసెంబ్లీ స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. పార్లమెంటు స్థానాన్ని ఇప్పటికైతే ప్రకటించకపోయినా ఆర్పీఐకి కేటాయించినట్లు ఆ పార్టీ నాయకుడు అంజయ్య తెలిపారు. నిరంతరం జనంలో తిరిగే మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ వంటి నాయకులున్న తిరుపతిలో ఇదేమి చిత్రమైన పరిస్థితి అని కాంగ్రెస్ అభిమానులు ఆవేదన చెందుతున్నారు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అయ్యో పాపం కాంగ్రెస్!

- తిరుపతిలో ఆ పార్టీ లేకుండా తొలిసారి ఎన్నికలు జరగనున్నాయా?
- ఇండియా కూటమి మిత్రపక్షాల పేరుతో తెరవెనుక మంత్రాంగం నడిచిందా?
- చింతా మోహన్ పరిస్థితి ఏమిటి?

రాష్ట్ర విభజన తర్వాత జరిగిన 2014, 2019 ఎన్నికల్లో తిరుపతిలోనూ కాంగ్రెస్ పార్టీ ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. అయినా ఆ పార్టీకి బలమైన అభిమానులున్నా వారంతా దాదాపుగా వైసీపీ నీడకిందకు చేరుకున్నారు. అయితే ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరగడం, ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, పీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిల నియమితురాలు కావడం వంటి కారణాలతో కాంగ్రెస్‌లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఆ పార్టీకి రాష్ట్రంలోనే పెద్దదిక్కుల్లో ఒకరైన చింతా మోహన్ తిరుపతి కేంద్రంగానే రాజకీయ కార్యకలాపాలు నడుపుతుంటారు. కొవిడ్ రోజుల్లో తప్ప ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో జనంలో ఉంటున్నారు. 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ, 2021 ఉప ఎన్నికల్లోనూ ఆయన కాంగ్రెస్ తరఫున ఎంపీగా పోటీ చేశారు. అలాంటిది తిరుపతి ఎంపీ టికెట్ కోసం ఆయన గత వారం రోజులుగా ఢిల్లీలో మకాం వేయాల్సిన పరిస్థితి నెలకొందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తన కుమార్తె డాక్టర్ సీనాకు గూడూరు టికెట్ కోసం కూడా ఆయన ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. ఎంపీ సీటును ఆర్పీఐకి కేటాయించినది నిజమే అయితే చింతా రాజకీయ జీవితంలోనే ఇదో పెద్ద అవమానం కాగలదని అంటున్నారు. ఇక తిరుపతి అసెంబ్లీ సీటును సీపీఐకి కేటాయించడంతో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి పోటీ చేస్తున్నారు. తిరుపతి నుంచి తమకు అవకాశం ఇవ్వాలని దొడ్డారెడ్డి రాఘ్ భూపాల్ రెడ్డి, మాంగాటి గోపాల్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే కోరారు కూడా. నవీన్‌కుమార్‌రెడ్డి నేరుగా షర్మిలను కలసి అభ్యర్థించారు. వీరందరినీ నిరాశ పరిచారు.

ఎవరికి మిత్రపక్షాలు?

ఈ నేపథ్యంలో తిరుపతిలో ఒక ప్రచారం బలంగా వినిపిస్తోంది. వైసీపీకి ప్రధాన అండగా ఉన్న రెడ్డి సామాజిక వర్గంలో చీలిక రాకుండా ఉండడానికే తిరుపతి టికెట్ ఆశించిన ముగ్గురికీ కాంగ్రెస్‌లో అవకాశం ఇవ్వలేదని అంటున్నారు. ఈ ముగ్గురూ రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు. తిరుపతిలో బంధుబలగం ఉన్నవారు. ఖచ్చితంగా ఎంతోకొంత ఓట్లను చీలుస్తారు. అందుకే మిత్ర పక్షం అంటూ కేటాయించేశారని చెప్పుకుంటున్నారు. ఈ నిర్ణయం వెనుక చాలా నడిచిందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఇంకో విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే.. అసెంబ్లీకి భూమన అభినయ్‌తో తలపడాల్సిన సీపీఐ నాయకుడు మురళి, ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నానని ప్రకటించిన అంజయ్య.. ఇద్దరూ భూమన కరుణాకరరెడ్డికి సన్నిహితులు కావడం. ఆయన తిరుపతిలో అద్భుతమైన అభివృద్ధి చేశారంటూ వీరు సమావేశాల్లో కీర్తించారు కూడా. భూమన కుటుంబానికి బాసటగా వీరు నిలబడ్డారు. మరి ఇటువంటి వారు భూమన అభినయరెడ్డితో తలపడడం ఎలా సాధ్యం అనే విమర్శ బలంగా వినిపిస్తోంది.



వైసీపీ ఆత్మీయ సభలో
టౌన్ బ్యాంకు మేనేజర్

ఎన్నికల ప్రచారాల్లో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనవద్దని కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించినప్పటికీ కొంత మంది ఉద్యోగులు ఆ నిబంధనలు పాటించడం లేదు.తిరుపతి కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు మాజీ ఉద్యోగులతో వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి శనివారం ఒక హోటల్లో సమావేశం నిర్వహించారు. టౌన్ బ్యాంకు ఛైర్మన్ కేతం జయచంద్రా రెడ్డి, వైస్ ఛైర్మన్ వాసు యాదవ్ ఆదేశాలతో బ్యాంకు మేనేజర్ ప్రభాకర రెడ్డి (పాండు)ఈ సమావేశం ఏర్పాటు చేశారు. బ్యాంకు మేనేజర్‌గా ఉన్న వ్యక్తి అధికార పార్టీ నాయకుడికి ఓట్లు వేయాలని కోరే సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.బ్యాంకు ఉద్యోగుల సంఘానికి ప్రభాకర రెడ్డి అధ్యక్షుడిగా కూడా ఉన్నారు.మెడికల్ బిల్స్ ఇస్తామని మాజీ ఉద్యోగులను బ్యాంకు పక్కనే ఉన్న ఓ హోటల్‌కు పిలిపించినట్టు తెలుస్తోంది. తీరా అక్కడ వైసీపీ అభ్యర్థి ప్రత్యక్షమై ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో పాండుపై కొంతమంది మాజీ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మామండూరులో
ఏనుగుల విధ్వంసం



రేణిగుంట మండలం మామండూరు అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న మామిడితోపులో శనివారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించింది. ఏనుగుల సంచారాన్ని గుర్తించిన స్థానికులు బాణాసంచా పేలుళ్లతో బెదిరించే ప్రయత్నం చేశారు. అయితే ఏనుగులు మామిడితోపు నుంచి వెళ్లకపోవడంతో గ్రామస్తులు వాటి దిశ మార్చి ఉదయం బయటకు పంపగలిగారు.బాధిత రైతు మురళి మాట్లాడుతూ ఏనుగుల గుంపుతో నష్టపోతున్న విషయమై గతంలో అటవీశాఖ అధికారులకు తెలియజేస్తే స్పందించలేదన్నారు. కేవలం ఫొటోలు తీసుకుని వెళ్లడం తప్ప సాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.మామిడితోపులకు ముందు ఏనుగులు రాకుండా ఏర్పాటు చేసిన గుంతలు పూడిపోయిన విషయాన్ని కూడా గతంలో అటవీశాఖ అధికారులకు చెబితే ఏఎఫ్‌వోను పంపి చేతులు దులుపుకున్నారని వాపోయారు.ఇప్పటికైనా ఏనుగుల దాడుల నుంచి రక్షణ కల్పించాలని, అలాగే నష్టపోయిన తమ పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

\- రేణిగుంట

దోషం దందా..!

- రాహు-కేతు పూజల్లో ఆగని బలవంతపు వసూళ్లు
- ముక్కంటీశుడి ఆలయంలో ఐదేళ్లుగా అంతులేని అవినీతి

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదేళ్లుగా అవినీతికి అంతే లేకుండా పోయింది. ప్రత్యేకించి రాహు-కేతు పూజల్లో భక్తుల నుంచి బలవంతపు వసూళ్లు విచ్చలవిడిగా సాగిస్తూనే ఉన్నారు. ఈ ఒక్క విభాగంలోనే రూ.50 కోట్లకుపైగా అక్రమ సొమ్మును పోగేసి.. వాటాలు వేసుకుని మరీ పంచుకున్నారు. నిత్యం ఇది బాహాటంగా జరుగుతూనే ఉన్నా ఏ ఒక్క అధికారి కూడా ఈ అక్రమ వసూళ్లను అడ్డుకోలేదన్న అపవాదు నేటికీ కొనసాగుతూనే ఉంది.

\- శ్రీకాళహస్తి



గ్రహణకాల సమయంలో అన్నిచోట్లా ఆలయాలను మూత వేసి.. విడుపు తర్వాత తిరిగి తెరుస్తుంటారు. కానీ శ్రీకాళహస్తిలో నవగ్రహాలను కవచంగా ధరించి కొలువుదీరిన వాయులింగేశ్వరుడికి అన్ని గ్రహణకాల సమయాల్లోనూ విశేషంగా అభిషేకాలు నిర్వహిస్తుంటారు. అంతేకాకుండా ఈ సమయంలో ఆలయాన్ని తెరచి భక్తులందరికీ దర్శన భాగ్యం కల్పిస్తుంటారు. ఈ గ్రహణ కాల అభిషేకాలను దర్శించుకోవడానికి విశేషంగా భక్తులు తరలివస్తారు. ఇంతటి మహిమాన్విత క్షేత్రం కావడంతో ముక్కంటి ఆలయంలో రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతారు. ఇటీవల దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో రాహు-కేతు పూజలు చేసుకునేందుకు విచ్చేస్తున్నారు.

దక్షిణ పెడితేనే దోషం పోతుందంటూ..

ఆలయంలో రాహు- కేతు పూజలను ఐదు ధరల టికెట్లపై నిర్వహిస్తుంటారు. రూ.500, రూ.750, రూ.1500, రూ.2500, రూ.5000 టికెట్లుగా విభజించి ఆయా మండపాల్లో బ్యాచ్‌ల వారీగా పూజలు చేస్తుంటారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు రోజూ ఈ పూజలు జరుగుతూనే ఉంటాయి. మండపాల్లో ఆశీనులైన భక్తులతో సామూహికంగా సంకల్పాన్ని మైక్‌లో అనౌన్స్ చేస్తూ రాహు-కేతు పూజలు జరిపిస్తారు. ఇదే మైక్ నుంచే ప్రతి ఒక్కరూ.. దక్షిణ ఇస్తేనే మీ దోషం పోతుందంటూ భక్తులను మానసికంగా భయపెడుతున్నారు. రూ.2,500 పూజలో అయితే రూ.201, రూ.5,000 పూజలో అయితే రూ.501 దక్షిణ పెట్టాలంటూ బలవంతంగా వసూలు చేస్తున్నారు. ఆలయంలో నెలకు అన్నిరకాల టికెట్లు కలిపి మొత్తం సుమారు లక్ష రాహు-కేతు పూజలు జరుగుతాయని అంచనా. అంటే సగటున రూ.100 చొప్పున లెక్కేసినా నెలకు రూ.కోటి సునాయాసంగా పోగేస్తున్నారు. అంటే వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.50 కోట్లకు ఈ దందా చేరిందన్నమాట. ఈ అక్రమ సొమ్మును నియోజకవర్గ ముఖ్య నేత నుంచి, కిందిస్థాయి ఆలయ సిబ్బంది వరకు బొక్కేస్తున్నారన్న విమర్శలున్నాయి.

భక్తులు నిలదీసినా..

ఈ అక్రమ వసూళ్లపై పలుమార్లు భక్తులు నిలదీశారు. దీనిపై లిఖితపూర్వకంగా దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అంతేకాకుండా ఇలా మండపాల్లో అక్రమ వసూళ్లపై నిలదీసిన భక్తులను కొన్ని సందర్భాల్లో ఆలయ ఉద్యోగులు చేయి చేసుకున్న ఘటనలు కూడా వెలుగు చూశాయి.

ఆధ్యాత్మికవేత్తలు హెచ్చరించినా..

బలవంతపు వసూళ్లు చేయడం మంచి పద్ధతి కాదని ఎందరో ఆధ్యాత్మికవేత్తలు హెచ్చరించారు. ఏడాది క్రితం విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ఆలయాన్ని దర్శించుకున్నారు. బహిరంగంగా మీడియా ఎదుటే రాహు-కేతు పూజల్లో వసూళ్లు తగదంటూ పాలకులకు, అధికారులకు హితవు పలికారు.

98శాతం పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 6: జిల్లాలో సామాజిక పింఛన్లు శనివారం నాటికి 98.89శాతం పంపిణీ చేసినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు.2,71,477మంది లబ్ధిదారులకుగాను గత నాలుగురోజుల్లో 2,68,474మందికి పింఛన్లు అందినట్లు తెలిపారు. 3,003మందికి పింఛన్లు ఇవ్వాల్సి ఉందని తెలిపారు.

65మంది వలంటీర్ల రాజీనామా

తిరుపతి(కలెక్టరేట్),ఏప్రిల్ 6: జిల్లావ్యాప్తంగా శనివారం 65మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు. కోట మండలంలో 24మంది, తడలో 13, నాయుడుపేటలో నలుగురు, తొట్టంబేడులో ముగ్గురు, సూళ్ళూరుపేటలో ఇద్దరు, తిరుపతి రూరల్ మండలంలో 10 మంది రాజీనామా చేశారు. వీరితో కలిపి ఇప్పటి వరకు జిల్లాలో 111మంది రాజీనామా చేసినట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.అయితే మన పార్టీయే మళ్లీ అధికారంలోకి వస్తుందని, రాజీనామా చేసి ప్రచారం చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని వలంటీర్లపై వైసీపీ నేతలు వత్తిడి తెచ్చి రాజీనామా చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఎమ్మెల్సీ సిపాయికి నోటీసులు జారీ

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6: ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యానికి నోటీసులు జారీ చేశారు. శ్రీకాళహస్తిలో పెద్ద మసీదు వద్ద శుక్రవారం స్వీటుప్యాకెట్లను ముస్లింలకు ఆయన పంపిణీ చేయడంపై ఆంధ్రజ్యోతిలో శనివారం వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై శ్రీకాళహస్తి రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రవి శంకర్ రెడ్డి స్పందించారు. ఎమ్మెల్సీకి నోటీసు జారీ చేశారు.ఆయన వివరణ అందిన తరువాత పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వెల్లడించారు.

టీడీఆర్ బాండ్లపై
ఇప్పుడేమంటారు ?

- రూ.4వేల కోట్ల అవినీతిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- నిందితులను వెంటనే అరెస్టు చేయాలి
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం డిమాండు



మీడియా సమావేశంలో ఆనం వెంకటరమణారెడ్డి

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 6 : తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్ల కోసం జారీ చేసిన టీడీఆర్ బాండ్లను ఆపేయాలని ప్రభుత్వమే నోటీసులు జారీ చేయడంతో తాము గతంలో ఆరోపించిన అవినీతి విషయాలను అంగీకరించినట్లయిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి తెలిపారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.బాండ్ల జారీ విషయంలో రూ. 10వేల కోట్ల అవినీతికి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి పాల్పడ్డారని గతంలో తాను వెల్లడించానన్నారు.అప్పుడు నోరు మెదపని వారు ఇప్పుడు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఇచ్చిన నోటీసులకు ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 17 రోడ్ల కోసం 376 టీడీఆర్ బాండ్లు తయారు చేసి రూ. 4వేల కోట్ల అవినీతికి శ్రీకారం చుట్టారని ఆనం ఆరోపించారు. ఇందులో రూ. 2వేల కోట్లు ఇప్పటికే బాండ్ల రూపంలో కొనుగోలు చేశారని వెల్లడించారు. జరిగిన అవినీతిపై విచారణ చేయించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కరుణాకరరెడ్డి, అభినయరెడ్డిపై రెవెన్యూ రికవరీ యాక్టు అమలు చేస్తారా అని ప్రశ్నించారు. ఇందులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి ప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. అప్పటి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ హరిత కూడా అవినీతిలో భాగస్తులేనన్నారు.గత ఆర్డీవో నరసారెడ్డి, రిజిస్ట్రార్, సర్వేయర్‌లకు కూడా ఇందులో ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు. మరో 2 నెలల్లో టీడీపీ అధికారంలోకి రావటం ఖాయమని, టీడీఆర్ బాండ్ల జారీపై పూర్తిస్థాయి విచారణ చేపడతామని ఆనం హెచ్చరించారు. భూములు ఇచ్చి నష్టపోయిన బాధితులకు తమ ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు.

కల్లూరు అడవిలో చిరుత సంచారం!

కల్లూరు, ఏప్రిల్ 6: చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలోని కల్లూరు నుంచి కొమ్మిరెడ్డిగారిపల్లెకు వెళ్లే అడవిమార్గంలో శనివారం రాత్రి చిరుతపులి సంచరించింది. కొమ్మిరెడ్డిగారిపల్లెకు చెందిన కొందరు కారులో కల్లూరుకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరు హైవే రోడ్డు దాటుకొని కొమ్మిరెడ్డిగారిపల్లె వైపు వెళుతుండగా రాత్రి ఏడు గంటల సమయంలో చిరుతపులి రోడ్డును దాటడం గమనించి భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి ఆ స్థలాన్ని పరిశీలించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

డంపింగ్ యార్డులో మంటలు

జాతీయ రహదారిని కమ్మేసిన పొగ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6: సూళ్లూరుపేట పట్టణ ప్రజలకు డంపింగ్ యార్డుతో అవస్థలు తప్పడంలేదు. ప్రతిరోజూ యార్డులో మంటలు వ్యాపించి పొగ జాతీయ రహదారిని, పట్టణాన్ని కమ్మేస్తుండడంతో ప్రజలతో పాటు వాహన చోదకులూ ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక హోలిక్రాస్ కూడలి బిడ్డి కాళంగి నది పక్కనే ఉన్న డంపింగ్ యార్డులో శనివారం సాయంత్రం నుంచి భారీగా మంటలు వ్యాపించాయి. పొగ పట్టణంతో పాటు జాతీయ రహదారిని కమ్మేసింది. దీంతో జాతీయ రహదారిపై వాహనాలకు దారి కనిపించక ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ అధికారులు, హైవే సిబ్బంది మూడు అగ్నిమాపక వాహనాలను తెప్పించి మంటలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. రాత్రి 8 గంటల వరకు మంటలు అదుపులోకి రాలేదు. పక్కనే ఉన్న కాళంగి నదిలో నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి మంటలను పూర్తిగా ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది వాహనాలను నెమ్మదిగా పంపిస్తున్నారు. తరచూ ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. డపింగ్‌యార్డు నుంచి వెలువడే పొగతో ఆరోగ్యం దెబ్బతింటోందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



డంపింగ్ యార్డులో మంటలు

పట్టణానికి దూరంగా డపింగ్‌యార్డు ఏర్పాటు చేసేందుకు ఐదేళ్ల నుంచి మున్సిపాలిటీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారే తప్ప మార్పులేదు.

293 గ్రాముల బంగారం స్వాధీనం

చిల్లకూరు, ఏప్రిల్ 6: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న 293 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని చెప్పారు. నెల్లూరు నుంచి చెన్నైకు రిలయన్స్ సంస్థకు చెందిన ఓ వాహనం బంగారు ఆభరణాలను తీసుకువెళుతుండడాన్ని గుర్తించామన్నారు. అందులో 36కిలో బంగారు ఆభరణాలకు సంబంధించిన రికార్డులు ఉన్నాయన్నారు. 17.30లక్షల విలువ చేసే 293 గ్రాముల బంగారానికి తగిన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి జీఎస్టీ అధికారులకు అందజేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి



భావేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



భావేష్ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 6: అనుమానాస్పద స్థితిలో పదో తరగతి విద్యార్థి మృతి చెందిన ఘటన నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారి సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.... విన్నమాల దళితవాడకు చెందిన వెంకటయ్య, సుభాషిణి దంపతుల కుమారుడు భావేష్(14) నాయుడుపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. సెలవులు కావడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఇంటి దగ్గర నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు, బంధుమిత్రులు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో రాళ్ల నడుమ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని చేరుకున్న పోలీసులు రాళ్లను తీసి చూడగా అందులో ఓ బాలుడు మృతదేహం లభ్యమైంది. అదే సమయానికి అక్కడకు చేరుకున్న భావేష్ తల్లిదండ్రులు చూసి ఆ మృతదేహం తమ కుమారుడుదేనంటూ బోరున విలపించారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సంఘటనాస్థలాన్ని చేరుకొని విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. భావేష్ తల, ముఖంపై గాయాలు ఉండటంతో తిరుపతి నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. మృతదేహం ఉన్న ప్రాంతం నుంచి విన్నమాల దళితవాడ వరకు డాగ్ స్క్వాడ్ వెళ్లి ఆగిపోయింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి



టీడీపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

చిల్లకూరు, ఏప్రిల్ 6: రాష్ట్రంలో విధ్వంసపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కడివేడు, తిమ్మనగారిపాళెం గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. నిత్యావసరాల ధరలు, విద్యుత్, బస్సు చార్జీలను పెంచి ప్రజలకు ఇబ్బందులకు గురిచేసిందన్నారు. పెన్షన్‌లను సకాలంలో సక్రమంగా పంపిణీ చేయకుండా టీడీపీపై దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పెన్షన్ రూ.4వేలు ఇంటి వద్దకే అందజేస్తుని చెప్పారు. సుపరిపాలన ప్రజలకు అందాలంటే ప్రజాఉమ్మడి కూటమిని గెలిపించాలని కోరారు. అనంతరం పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, భాస్కర్‌రెడ్డి, గుండాల లీలావతి, వెంకటేశ్వర్లునాయుడు, కీరవాణి, విక్రమ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరయ్యస్వామి ఆరాధన

డక్కిలి, ఏప్రిల్ 6: డక్కిలి మండలం నపడింపల్లిలో అవదూత వీరయ్యస్వామి ఆరాధన శనివారం వైభవంగా జరిగింది. ఆలయంలో ఉదయం 4 గంటలకు విఘ్నేశ్వర స్వామికి పూజ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, 7 గంటలకు సుదర్శన హోమం, 12 గంటలకు మహానైవేద్యం కార్యక్రమాలు జరిగాయి. మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కాగా వీరయ్య స్వామిని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దర్శించుకొన్నారు. స్వామివారి ఆరాధన ఏర్పాట్లను సర్పంచు అద్దంకి మునిరత్నం నాయుడు, గ్రామ పెద్దలు దుగ్గి వెంకటేశ్వర్లు, నర్రావుల కోటేశ్వర నాయుడు, సిద్దయ్య, గోపాల్ నాయుడు, జగన్నాథనాయుడు పర్యవేక్షించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పునుగోటి విశ్వనాధనాయుడు, చెలికం బాస్కరరెడ్డి, కాపా శ్రీనివాసులు నాయుడు, అవ్వారు సత్యం తదితరులు వున్నారు.

ఘనంగా ధ్వజారోహణం



సంఘమేశ్వరుడు, కామాక్షీదేవి ఉత్సవర్లకు పల్లకీ సేవ - ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న వేదపండితులు

కోట, ఏప్రిల్ 6: మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. ధ్వజస్తంభానికి వేదపండితులు కోడి వస్త్రాన్ని కట్టి దీపాన్ని వెలిగించారు. సంతానం లేని మహిళలు, పెళ్లికాని యువతులకు వివాహం జరుగుతుందన్న విశ్వాసంతో పోటాపోటీగా ధ్వజస్తంబానికి కట్టిన కోడి వస్త్రాలను తాకి కోడి ముద్దలను స్వీకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో సంఘమేశ్వరుడు, కామాక్షి శ్రీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి పల్లకీ సేవ నిర్వహించారు.

ప్రసన్న వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు

కోట, ఏప్రిల్ 6: మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో గల ప్రసన్న వెంకటేశ్వరుడు, చిట్టేడు, గోవిందపల్లి, శ్రీలక్ష్మమ్మకాలనీలలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వెంకటేశ్వరస్వామి విగ్రహాలకు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు.

చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు



ట్యాబ్ అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 6: చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో ఒలంపియాడ్ లెవెల్-2 పరీక్షల్లో ప్రతిభచాటిన 7వ తరగతి విద్యార్థి శివధనుష్‌కు ట్యాబ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి వాటిని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీకాంత్, శ్రీహరి, హరిబ్రహ్మ, గాంధీ, అప్సర, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత కొండేపాటి జన్మదిన వేడుకలు



కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న కొండేపాటి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6: ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ జన్మదిన వేడుకలను శనివారం ఆయన నివాసం వద్ద పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 150మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విచ్చేసి గంగాప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజీ, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ ఎమ్మెల్యేలు నెలవల సుబ్రహ్మణ్యం, పరసా వెంకటరత్నం, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్ కుమార్, సూళ్లూరుపేట, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థులు నెలవల విజయశ్రీ, లక్ష్మీసాయిప్రియ, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, తిరుమూరు సుధాకర్ రెడ్డి, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ కుమార్, ఆకుతోట రమేష్, బొమ్మన్ శ్రీధర్, కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని చేయూత చిల్డ్రన్‌హోమ్‌లో కొండేపాటి గంగాప్రసాద్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ చిన్నారుల నడుమ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పసల చెంగయ్య, నిజామ్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: స్థానిక టీడీపీ కార్యాలయంలో గంగాప్రసాద్ పుట్టిరోజు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, శివకుమార్, శివప్రసాద్, మల్లికార్జున్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, గాయం రమణయ్య, అమరయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేగా దళితులకు

రెండోసారి అవకాశమివ్వరా?

జగన్‌పై వరప్రసాదరావు ధ్వజం

నాయుడుపేట, ఏప్రిల్ 6: ఎంపీ, ఎమ్మెల్యేగా దళితులకు రెండోసారి అవకాశమివ్వరా అని గూడూరు ఎమ్మెల్యే, తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వెలగపూడి వరప్రసాదరావు ప్రశ్నించారు. నాయుడుపేటలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను నిరుపేద కుటుంబంలో జన్మించి ఐఏఎస్ అయ్యానని, అంతకుమించి సేవచేయాలన్న దృక్పథంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. 2014లో వైసీపీలో తిరుపతి ఎంపీగా సేవలు అందిస్తే, 2019లో గూడూరు ఎమ్మెల్యే సీటు ఇచ్చారన్నారు. ఈసారి కనీసం ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వకుండా సీఎం జగన్ తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే రెడ్డి సామాజిక వర్గానికి మాత్రం ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికి కూడా టికెట్లు ఇచ్చారని విమర్శించారు. జగన్ మాత్రం రెండోసారి సీఎం కావడానికి తహతహలాడుతున్నారని, దళిత ఎంపీ, ఎమ్మెల్యేలకు రెండోసారి చాన్స్ లేకుండా చేశారని మండిపడ్డారు. వైసీపీలో దళితులు, బహుజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాలాద్రినాయుడు, మాజీ కార్యదర్శి ఆశ చెంచుకృష్ణయ్య, పట్టణ అధ్యక్షుడు పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిగురాకుల సురేంద్ర బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగినేని కృష్ణయ్య, ఎస్టీ మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యువత భవిష్యత్తుకు భరోసా



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జశ్వంత్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 6: టీడీపీ ప్రభుత్వ పాలనతోనే యువత భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తనయుడు డాక్టర్ జశ్వంత్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పురిటిపాళెం గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం యువతను మోసం చేసిందన్నారు. ప్రతి ఏడాది జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగాన్ని, పలు పరిశ్రమలను ప్రోత్సహించి యువతకు ఉపాధి కల్పించిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెంచలప్రసాద్, ఇంద్రవర్ధన్, గురవయ్య, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏతోనే సుస్థిరపాలన: బీజేపీ

నాయుడుపేట, ఏప్రిల్ 6: ఎన్‌డీఏ కూటమితోనే దేశంలో సుస్థిరపాలన ఏర్పడుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక విజయగణపతి దేవస్థానం వద్ద శనివారం తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావుతో కలసి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాలాద్రినాయుడు, మాజీ కార్యదర్శి ఆశ చెంచుకృష్ణయ్య, పట్టణ అధ్యక్షుడు పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిగురాకుల సురేంద్రబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగినేని కృష్ణయ్య, ఎస్టీ మోర్చ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు సుందరరావు, సూరిబాబు, బాంధవయ్య, కృష్ణ పాల్గొన్నారు.

17 మంది వలంటీర్లు రాజీనామా

తడ/నాయుడుపేట, ఏప్రిల్ 6: తడ మండలం కాదలూరు సచివాలయ పరిధిలోని 13 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. సచివాలయ పరిధిలో 14 మంది వలంటీర్లు ఉండగా, వారిలో 13 మంది ఎంపీడీవో ఆమోస్‌బాబుకు రాజీనామా పత్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్వగ్రామమైన కాదలూరులో 13 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా సమర్పించడం చర్చనీయాంశమైంది. అలాగే నాయుడుపేట మండలంలోని మర్లపల్లె సచివాలయ పరిధిలో నలుగురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో ప్రేమ్‌రాజ్ తెలిపారు.

షాట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



బాధితులకు ఆర్థికసాయం, నిత్యావసరాలను అందజేస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

చిల్లకూరు, ఏప్రిల్ 6: స్థానిక అరుంధతీయవాడలో శనివారం వేకువన ఓ పూరిల్లు దగ్ధమైంది. బాధితుడు శీనయ్య కథనం మేరకు.... తాను, తన కుటుంబసభ్యులు పూరింటిలో నిద్రిస్తుండగా షాట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. మంటలను అదుపు చేసే క్రమంలో శీనయ్య అల్లుడు విజయ్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఇంట్లోని సామాన్లతో పాటు బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, ధాన్యం అమ్మగా వచ్చిన నగదు మంటల్లో కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తహసీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది కాలిపోయిన ఇంటిని పరిశీలించారు. బాధితులకు బియ్యం, నిత్యావసరాలను, రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమ్య, వీఆర్‌వో రమణయ్య, సిబ్బంది యామిని, రాధా, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

పలు దుకాణాల్లో చోరీ

చిట్టమూరు, ఏప్రిల్ 6: మండల కేంద్రమైన చిట్టమూరులోని కొత్తగుంటలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పలు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. కొత్తగుంట భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న ఓ చిల్లర దుకాణంలో తాళాలు పగులగొట్టి నగదు, విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. అలాగే చిట్టమూరు రోడ్డు సమీపంలోని వేణురెడ్డి దుకాణ సముదాయంలో పలు షాపుల తాళాలు పగులగొట్టారు. మీసేవ కేంద్రం సమీపంలోని మరో దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మెప్మా సీఎంఎంపై దాడి - దాడిలో కిందపడిపోయిన సౌజన్య

మెప్మా కార్యాలయంలోనే

సీఎంఎంపై అధ్యక్షురాలి దాడి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6: సచివాలయంలోనే మెప్మా సిటీ మిషన్ మేనేజర్(సీఎంఎం) సౌజన్యపై దాడి జరిగింది.సూళ్లూరుపేట గాండ్లవీధిలోని స్త్రీ స్వశక్తి భవనంలో ఉన్న సచివాలయంలో సీఎంఎం సౌజన్య సమావేశం నిర్వహిస్తుండగా మెప్మా అధ్యక్షురాలు స్వప్న, ఆర్పీలు కలసి ఆమె చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ లాక్కుని కిందపడేసి దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు పరస్పరం ఫిర్యాదులు చేసుకొన్నారు.పోలీసులు సాయంత్రం రమ్మనడంతో సీఎంఎం సౌజన్య స్త్రీ స్వశక్తి భవనానికి వెళ్లిపోయారు. సాయంత్రం మెప్మా అధ్యక్షురాలు స్వప్న తన భర్త, అత్తతో స్త్రీ స్వశక్తి భవనానికి చేరుకుని ఆర్పీలతో కలిసి సౌజన్యపై దాడిచేశారు.ఈ దాడిలో సౌజన్య బట్టలు చినిగిపోవడమే కాకుండా స్పృహతప్పి పడిపోయారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.ఎస్‌ఐ రహీం రెడ్డి అక్కడకు చేరుకొని విచారించారు. ఇటీవల మన్నారుపోలూరులోని ఓ పొదుపు గ్రూపులో లోన్ కట్టే విషయంలో ఆలస్యం చేయడమే కాకుండా ఆర్పీలు కొంత నగదు కాజేసినట్లు తెలిసింది. దీంతో సంబంధిత అధికారుల అనుమతి లేకుండా బ్యాంకు వద్దకు వెళ్లవద్దని మెప్మా అధ్యక్షురాలికి సీఎంఎం చెప్పడంతో వారి నడుమ వివాదాలు తలెత్తాయి.చివరకు ఈ వివాదాలు దాడి చేసే పరిస్థితికి దారితీశాయి.అధికార పార్టీకి చెందిన మెప్మా అధ్యక్షురాలు తన భర్త, అత్తలను కార్యాలయం లోపలికి తీసుకొచ్చి అధికారిపై దాడిచేయించడం దుర్మార్గమంటూ తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ పాలనలోనే గ్రామీణాభివృద్ధి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పరసా రత్నం

ఓజిలి, ఏప్రిల్ 6: టీడీపీ పాలనలోనే గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరసా రత్నం, సూళ్లూరుపేట ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఓజిలి మండలం రాచపాళెంలో శనివారం సూళ్లూరుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, వీధిలైట్లతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించారని తెలిపారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పంచాయతీల నిధులు లాక్కోవడంతో పారిశుధ్య పనులకు కూడా దిక్కులేకుండా పోయిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టీడీపీ కార్యకర్తలు, నాయకులు నడుం బిగించారని, చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా నెలవల విజయశ్రీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఓజిలి మండల టీడీపీ కన్వీనర్ గుజ్జులపూడి విజయకుమార్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి నిరంజన్, జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, తిరుపతి పార్లమెంటు బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకులు బత్తల రవీంద్రారెడ్డి, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్, నాయకులు అర్జున్‌రాజు, మన్మధరావు, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

బాలాయపల్లి, ఏప్రిల్ 6: టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని వెంకటగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ అన్నారు. శనివారం మండలంలోని గొటికాడు గ్రామానికి చెందని వైసీపీ నాయకుడు వేమూరు సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. వారికి లక్ష్మీసాయిప్రియ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, కూని శ్రీహరి, రాంబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీతోనే దేశాభివృద్ధి: బీజేపీ



బైక్‌ర్యాలీలో బీజేపీ నాయకులు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 6: దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే తిరిగి మళ్లీ నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా గెలవాల్సిన అవశ్యకత ఉందని బీజేపీ నాయకురాలు శాంతారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బైక్‌ర్యాలీ నిర్వహించారు. స్థానిక సొసైటీ కాలనీలోని బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌రావు నివాసం వద్ద పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి అక్కడ నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, నవీన్‌కుమార్‌గుప్తా, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, సంజీవయ్యనాయుడు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, నరేంద్ర, భార్గవ్, మనోజ్ కుమార్, మన్నెం శీనయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోట: బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబరీషా, పరుశురామ్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోగుతొట్టి మురళి ఆధ్వర్యంలో పెన్నేపల్లి, శిరసనంబేడు, చెన్నప్ప నాయుడుపేట, చేంబేడు, పునబాక, అక్కగారిపేట, నెలబల్లి తదితర గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు కలిచేటి నరసింహులు, గణేష్, భరత్, నరసయ్య, కామయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

గూడూరు, ఏప్రిల్ 6: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ముందుకు సాగాలని సిఫాల్ హెర్బల్ ప్రైవేటు లిమిటెడ్ సీఈవో విద్యాసాగర్ అన్నారు. శనివారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి సాంకేతిక సింపోసియం నిపుణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే విజయాలను సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్ డాక్టర్ వెంకటేశ్వరరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధం సభకు బస్సులు... ప్రయాణికుల అవస్థలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 6: నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించిన వైసీపీ సిద్ధం సభకు సూళ్లూరుపేట డిపో నుంచి బస్సులను తరలించడంతో గ్రామాలకు బస్సులేక ప్రయాణికులకు ఇబ్బందులు పడ్డారు. డిపోలో 30 బస్సులు ఉండగా, 15 బస్సులను సిద్ధం సభకు తీసుకెళ్లారు. దీంతో తిరుపతి, నెల్లూరు, చెన్నై మార్గాల్లో బస్సులు లేక ప్రయాణికులు బస్టాండులో పడిగాపులు కాయాల్సి వచ్చింది. దీనికి తోడు ఎండ అధికంగా ఉండడంతో చిన్న పిల్లలు, వృద్ధులు అవస్థలు పడాల్సి వచ్చింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెళ్లకూరు, ఏప్రిల్ 6: మండలంలోని జాతీయ రహదారిపై ఎగువ చావాలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం మేరకు.. జిల్లా రవాణాశాఖ అధికారి ఆదినారాయణ నాయుడుపేట నుంచి శ్రీకాళహస్తి వైపు కారులో వెళ్తుండగా ఎగువ చావాలి వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ మోహన్‌కు గాయాలయ్యాయి. అతడిని శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

బాలాయపల్లి, ఏప్రిల్ 6: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పుల్లారావు అన్నారు. శనివారం స్థానిక బాలాయపల్లి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి సుబ్రహ్మణ్యం రోడ్డు కూడలి వద్ద విద్యార్థులతో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ పాల్గొన్నారు.